
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 12 మార్చి 2025

పీఎఫ్ కోసం పడిగాపులు

- జూలై నుంచి నిలిచిన చెల్లింపులు
- 600 మంది ఉద్యోగులకు రూ.80 కోట్లు
- జడ్పీలో బిల్లులన్నీ క్లియర్.. సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్



జిల్లా పరిషత్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ సొమ్మును దారిమళ్లించి ఐదేళ్ల ఇబ్బంది పెట్టగా.. కూటమి ప్రభుత్వంలో చెల్లింపులు జరగక వారు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) చెల్లింపు లు నిలిచిపోయాయి. గత ఏడాది జూలై నుంచి చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందిన సుమారు 600 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.80 కోట్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. సంబంధిత బిల్లులన్నీ జిల్లా పరిషత్ నుంచి ఎప్పుడో క్లియర్ చేశారు. ఇక్కడ నుంచి వెళ్లిన బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. నెలల తరబడి పీఎఫ్ చెల్లింపులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో 10 వేల మంది పీఎఫ్ చందాదారులు ఉండగా వారికి సంబంధించి సుమారు రూ.300 కోట్ల పీఎఫ్ మూలధనం ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా 12 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాకు జమ చేస్తారు. ఒక వేళ ఉద్యోగికి ఇన్సూరెన్స్ లేకపోతే జీతంలో 6 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్ము ఉద్యోగి ఆర్థిక భద్రత కొరకు మాత్రమే ఉద్దేశించబడింది. ఉద్యోగి తన పీఎఫ్ ఖాతా లో ఉన్న సొమ్ముపై అవసరమైనప్పుడు రుణం పొందవచ్చు. దీంతో ఉద్యోగులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు వ్యాపారుల వద్ద వడ్డీరేట్లు భరించలేక పీఎఫ్ సొమ్మును వాడుకుంటుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూన్ వరకు పీఎఫ్ బకాయిలు అన్నింటినీ క్లియర్ చేసింది. జూలై తర్వాత వచ్చిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. జిల్లా పరిషత్‌లో ప్రతి నెలా సుమారు 100 మంది ఉద్యోగులు పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేస్తుంటారు. ప్రతి నెలా రూ.6 కోట్లకు తగ్గకుండా పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వం మారిన తర్వాత పాత చెల్లింపులు జరగడంతో చాలా మంది ఉద్యోగులు రుణం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎనిమిది నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

ఈ నెలలో చెల్లింపులు..

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చెందిన పీఎఫ్ బకాయిలు అన్నీ ఈ నెలలో క్లియర్ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం మోక్షం కల్పిస్తుందని అంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఈ నెలలో పీఎఫ్ చేతికి వస్తుందన్న ఆశతో ఉన్నారు.



అవకతవకలపై.. అలసత్వం

- రాయితీ యంత్రాల పంపిణీలో గోల్‌మాల్
- విచారణకు ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఆదేశం
- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఇటీవలే ఆడిట్ పూర్తి.. వివరాలు బహిర్గతంపై గోప్యత
- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు శూన్యం

రైతులకు సాంకేతిక సహకారం అందించి ఆధునిక వ్యవసాయంపై మళ్లించడం.. తద్వారా సాగులో నష్టాలను తగ్గించడం.. లాంటి లక్ష్యాలతో రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పరిక రాలను ప్రభుత్వం అందిస్తుంటోంది. అయితే గత వైసీపీ హయాంలో తొలుత వీటి గురించి పట్టించుకోకుండా చివరి రెండేళ్లలో యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. అయితే రైతుల పేరిట వైసీపీ నేతల అనుచరులకే పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. నాడు వ్యవసాయశాఖ ఈ ఆరోపణలు పట్టించుకోలేదు. అసలు రైతులే కాని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి అడ్డగోలుగా ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అవకతవకలపై విచారణకు ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ శాఖలో స్పందన లేదని రాయితీ యంత్రాల పరికరాల పంపిణీలో జరిగిన అవక తవకల వెలికితీతపై జరుగుతున్న తాత్సారంతో తేటతెల్ల మవుతోంది. తూతూ మంత్రంగా జరిపిన ఆడిట్ నివేదిక లను కూడా బహిర్గత పరచకుండా గోప్యత పాటిస్తుం డటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో అనర్హులు లబ్ది పొంది దర్జాగా అనుభ విస్తున్న వారిపై చర్యలు లేకపోగా వ్యవస్థలు చోద్యం చూడడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ఈ అంశాలను తేల్చాలి..

- యూనిట్లకు ఎంపిక చేసిన గ్రూపులోని సభ్యులు ఎవరు.
- వారందరూ రైతులేనా.. ఆ ఫలాలు పొందడానికి అర్హులేనా.
- రాయితీ యంత్రాలు కేటాయించిన దగ్గర నుంచి ఎంత మంది రైతులకు అద్దెకిచ్చారు.వాటి ద్వారా వసూలైన అద్దె మొత్తాలెంత.
- యంత్రాలన్నీ రైతు సేవా కేంద్రాల్లోనే ఉంటున్నాయా లేక అమ్ముకున్నారా..
- రైతుల పేరిట తీసుకున్న వాటిలో కొన్ని యంత్రాలను ఏకంగా అమ్మేసుకున్నారు.. వీటిని గుర్తించాలి.

ఇళ్లల్లోనే 200 యూనిట్లు.. 450 అదృశ్యం

ప్రభుత్వ ఆదేశాలతో యంత్ర పరికరాల ఆడిట్‌ను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉండాల్సిన దాదాపు 200 యూనిట్ల యంత్ర పరికరాలు ఇప్పటికీ వైసీపీ నేతల అనుచరుల ఇళ్ల వద్దనే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం. మూడు జిల్లాల పరిధిలో మరో 450 వరకు పరికరాలు అదృశ్యమైనట్లు ఆడిట్‌లోనే వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇళ్ల వద్దకు వెళ్లి పరికరాల పై అధికారులు విచారణ నిర్వహించడంపై అనుమానాలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు రాయితీపై యంత్రాలను ప్రభుత్వాలు అందిస్తుంటాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా జారీ చేసిన యూనిట్లలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. తొలి మూడేళ్లు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ ఊసె త్తని ప్రభుత్వం చివరి రెండేళ్లలో యూనిట్లు అందించడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఆ పరికరాలు అందుకున్నది రైతులంటే పప్పు లో కాలేసి నట్లే. రైతులకు మేలు చేసే పేరిట ఈ రాయితీలను కూడా వైసీపీ నేతాగణం అనుచరులకే దోచి పెట్టిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. ఈ రాయితీ యంత్రాల యూనిట్లలో జరిగిన కిరికిరికి సంబంధించి విచారణకు గతేడాది జూలైలోనే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇప్పటి వరకు దానిపై పురోగతి ఏమిటనే దానికి వ్యవసాయశాఖ నుంచి సమాధానమే లేదు. యంత్రపరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలన్నది గత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లోనే ఉంది. ప్ర భుత్వం మారినా ఆ ఆదేశాలు అమలు కాకపోగా ఇళ్ల దగ్గరకు వెళ్లి అధికారులు ఆడిట్ నిర్వహించడం ఏమిటన్నది తెలియాలి. ఇతర రైతులకు పరికరాలను

(మిగతా 8వ పేజీలో)

నిరుద్యోగులకు తీపికబురు

వయో పరిమితి సడలింపుతో లబ్ది

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఊరట
- డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు రాసేవారికి ఉపయోగం



కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువత

గుంటూరు(విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇప్పటి వరకు ఉన్న వయోపరిమితిని సడలిస్తూ నూతన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షతిరేకం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగులకు, త్వరలో జరిగే గ్రూప్ పరీక్షలు రాసే వారికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఒక్క సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఏ పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో వేలమంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు యూనిఫామ్ సర్వీస్ రిక్రూట్మెంట్లో రెండేళ్లు, నాన్ యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల్లో 34 నుంచి 42 వరకు వ యోపరిమితిని సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుద్యోగులకు వరమే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏటా సగటున 25 నుంచి 30 వేల మంది వరకు ఉంటున్నారు. ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తి చేసిన వారు ఐటీ ఉద్యోగాల వైపువెళ్తున్నారు. సాధారణ డిగ్రీతోపాటు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ప్రభుత్వం భర్తీ చేయనున్న మెగాడీఎస్సీ కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేల మంది సన్నద్ధమవుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కొలిక్కి వచ్చింది. గ్రూప్ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. వయోపరిమితి స డలింపు నిరుద్యోగులకు వరమేనని యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

అభివృద్ధికి.. ఇన్‌చార్జి అధికారులు

- గుంటూరు జిల్లాకు కన్నబాబు
- బాపట్లకు కృతికా శుక్ల, పల్నాడుకు కరుణ
- జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా సాయిప్రసాదు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణతో సంక్షేమం వేగవంతం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. గుంటూరు జిల్లాకు సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబుని నియమించింది. బాపట్లకు కృతికాశుక్ల, పల్నాడుకు వీ కరుణని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడుని ఒక జోన్‌లో చేర్చి దానికి ఇన్‌చార్జి అధికారిగా స్పెషల్ సీఎస్ హోదాలో ఉన్న జీ సాయిప్రసాదుని నియమించింది. తొలుత జిల్లా ఇన్‌చార్జి అధికారులు ఆయా జిల్లాలకు వచ్చి కలెక్టర్లతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత జోనల్ ఇన్‌చార్జి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ వల్ల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వేగవంతంగా అందుతాయని అధికారవర్గాలు తెలిపాయి.

సఖి నివాస్ సిద్ధం

- నిరీక్షణకు ఎట్టకేలకు తెర

8


రేషన్ బియ్యం తరలింపు కేసులో.. నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ

6

రూ.లక్ష కోట్లు వచ్చేలా

అమరావతి నిర్మాణం

- గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి
- అమరావతిని విచ్ఛిన్నం చేసిన గత వైసీపీ పాలకులు
- భారతీయుల కోసం ఎదురుచూస్తోన్న ప్రపంచ దేశాలు
- ఎస్ఆర్ఎం వర్సిటీలో సీఎం చంద్రబాబునాయుడు



ఎస్ఆర్ఎంలో సీవీ రామన్ భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవల్‌మెంట్ అనే అంశంపై అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సు ముగింపు సభలో సీఎం ప్రసంగించారు. గత ఐదేళ్లపాటు గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. 2019 తర్వాత కూడా రాజధాని అమరావతి నిర్మాణాన్ని యధారీతిన కొనసాగించి ఉంటే ఈపాటికి ఈప్రాంత రూపురేఖలన్నీ పూర్తిగా మారిపోయి ఉండేవన్నారు. అలా జరగకపోగా జరిగిన అభివృద్ధిని విచ్చిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని అంతటా సోలార్ ఎనర్జీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో నిజమైన పేదలను గుర్తించి వారికి అన్ని విధాలా చేయూత ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే, అన్నీ రంగాల్లో కొనసాగుతున్న పని విధానంలో కూడా మార్పులు రావాల్సి ఉందన్నారు. మగవారి కన్నా మహిళలే వివిధ రంగాలలో రాణిస్తున్నారని, జీతాల విషయంలో కూడా వారిదే పైచేయని చెప్పారు. వ్యవసాయ రంగంలో మరిన్ని ఆధునిక సాంకేతికత వినియోగించాలన్నారు.

జనాభాకు అనుగుణంగా సదుపాయాలు..

జనాభా పెరుగుదల ఆధారంగా మౌలిక సదుపాయాలను కల్పించడం కూడా ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. జనాభా పెరుగులకు అనుగుణంగా ఆహారోత్పత్తి, నీటి వసతిని పెంచాలన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతమైందన్నారు. తెలుగువారు ప్రపంచంలోని అన్నీ దేశాలలో విస్తరించి కీలకరంగాల్లో అగ్రగాములుగా రాణిస్తున్నారన్నారు. జపాన్, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారతీయుల కోసమే ఎదురుచూస్తున్నాయన్నారు.

అంకుర కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విస్తరణకు భూములతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అంకుర కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎస్ఆర్ఎం యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు ఎస్ఆర్ఎంలో అకడమిక్ క్లస్టర్ (రూ.270కోట్లు), వేదవతి-2(రూ.160 కోట్లు),గంగా హాస్టల్-2(రూ.120 కోట్లు), అంతర్జాతీయ పరిశోధనా పార్కు (రూ.200 కోట్లు) నిర్మాణాలకు చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. అనంతరం సీవీ రామన్ బ్లాక్ (రూ.200 కోట్లు), గంగా హాస్టల్ బ్లాకు నెం.1(రూ.150 కోట్లు) భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రణాళికా శాఖ కార్యదర్శి అనంత్‌శంకర్, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వైస్‌చాన్సలర్ ఆచా ర్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ ఆచార్య డి.నారాయణరావు, ప్రణాళికా శాఖ ఈడీ టీఆర్ అలపర్తి, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (బుధవారం)

సహరి : 5.01 (గురువారం)

కారం మిల్లులపై విజిలెన్స్

- రూ.17,43 లక్షల కారంపొడి స్వాధీనం
- మిర్చి, పసుపు, ధనియాలు అక్రమ నిల్వల గుర్తింపు



గుంటూరులో కారం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండానే కారం పొడి తయారు చేసి విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్న మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ దాడుల్లో రూ. 17,43,500 విలువ చేసే కారం పొడిని స్వాధీనం చేసుకు న్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గుంటూరులోని చిలకలూరిపేటరోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్ కారం మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లు యజమాని బండారు రవీంద్రకుమార్ ఎటువంటి బిల్లులు, రికార్డులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మిర్చి యార్డు దగ్గరలో ఉన్న మోహన్‌లాల్ మహేంద్రకుమార్ అండ్ కంపెనీ నుంచి బిల్లులు లేకుండా మిర్చి తీసుకువచ్చి కారం పొడి తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. 13,915 కేజీల చిల్లీ పౌడర్, రూ.3,14,250 విలువ చేసే 1815 కేజీల మిరపకాయలు, 75 కేజీల పసుపు, రూ.1,06,854 విలువ చేసే 1320 కేజీల ధనియాలు బిల్లులు లేకుండా కలిగి ఉన్నారని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారం పొడి నమూనాలను సేకరించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు హైదరాబాద్‌లోని లేబరేటరీకి పంపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలు నిర్దేశం

- గుంటూరు జిల్లాకు రూ.64.80 లక్షలుగా నిర్దేశం
- పల్నాడు రూ.29.70 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.7.62 కోట్లు..
- ఏఎంసీల సెక్రెటరీలు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు


గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రోజు వారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాని ఆ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత నిర్దేశించారు. మంగళవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజు వారీ వసూళ్లతోనే ఆర్థిక సంవత్సర లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఈ విషయంలో సెక్రెటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు కలిపి రోజువారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని రూ.64.80 లక్షలుగా కమిషనర్ నిర్ణయించారు. ఇందులో గుంటూరు ఏఎంసీకి రూ.44 లక్షలు, తెనాలి రూ.5 లక్షలు, పొన్నూరు రూ.5 లక్షలు, దుగ్గిరాలకు రూ.2.50 లక్షలు, తాడికొండ రూ.2 లక్షలు, మంగళగిరికి రూ.2 లక్షలు, ఫిరంగిపురానికి రూ.2 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.2.30 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించారు. పల్నాడు జిల్లాకు రోజు వారి లక్ష్యం రూ.29.70 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో చిలకలూరిపేటకు రూ.3.60 లక్షలు, సత్తెనపల్లికి రూ.2.30 లక్షలు, పిడుగురాళ్లకు రూ.2 లక్షలు, నరసరావుపేటకు రూ.2.10 లక్షలు, వినుకొండకు రూ.2.70 లక్షలు, క్రోసూరుకు రూ.1.95 లక్షలు, మాచర్లకు రూ.1.20 లక్షలు, రొంపిచర్లకు రూ.1.70 లక్షలు, ఈపూరుకు రూ.1.20 లక్షలు, రాజుపాలేనికి రూ.1.50 లక్షలు, దుర్గికి రూ.1.90 లక్షలు, గురజాలకు రూ.7.55 లక్షలు నిర్దేశించారు. బాపట్లలోని ఏఎంసీలన్నింటికి కలిపి రూ.30.27 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.22.65 కోట్లు వసూళ్లు జరిగాయి. ఈ దృష్ట్యా ఏఎంసీల సెక్రెటరీలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. 50 శాతం కంటే తక్కువగా మార్కెట్ ఫీజు వసూళ్లలో తాడికొండ, సత్తెనపల్లి, మాచర్ల, రొంపిచర్ల ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కెటింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలానే ఈపూరు, పిడుగురాళ్ల, కూచినపూడి, పర్చూరు, క్రోసూరు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, మంగళగిరిలో 50 నుంచి 70 శాతం మార్కెట్ ఫీజుల వసూళ్ల జరిగాయి. ఇక 70 నుంచి 90 శాతం తక్కువగా దుర్గి, అద్దంకి, వినుకొండ, బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, గురజాల, వేమూరు, చీరాల, రేపల్లె, ప్రత్తిపాడు, పొన్నూరు ఏఎంసీలున్నాయి. 90 నుంచి 100 శాతం వసూళ్ల చేసిన వాటిల్లో సంతమాగులూరు, దుగ్గిరాల ఉన్నాయి. 100 శాతం లక్ష్యాన్ని అధిగమించిన ఏఎంసీలు మూడు జిల్లాల్లో ఒక్కటి కూడా లేదని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, రామాంజనేయులు, ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరి చంద్రిక, మంగళగిరి ఏఎంసీ సెక్రెటరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన మార్కెటింగ్ సెక్రెటరీలు, మాట్లాడుతున్న కమిషనర్ విజయ సునీత

విద్యావ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో నూతనమార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో భ్రష్టుపట్టించారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అసెంబ్లీ సమావేశంలో మంగళవారం మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల్లో గత పాలకులు అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీసం విద్యార్హతలు లేనివారిని విద్యాశాఖ మంత్రిగా చేసి ఈ రోజు యువత పోరు ఎలా చేస్తారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకోవడమే సరిపోయిందని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఇప్పటికీ కూడా పెండింగ్ ఉన్న బిల్లులు ఉన్నాయని, వాటిని తీర్చడానికే సమయం సరిపోతుందని, కనీసం అసెంబ్లీకి వచ్చి మాట్లాడనివారికి విద్య గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికీ కూడా చాలా కాలేజీల్లో ఫీజులు చెల్లించక రోడ్డుమీద పడ్డారని అన్నారు. ఈ రోజు మేము పారదర్శకంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సర్టిఫికెట్లు పంపిస్తున్నామని, ఈ నెల 17న జరగబోయే 10వ తరగతి పరీక్షలకు కూడా ఆర్టీసీ ద్వారా ఉచిత బస్సు కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో విద్యార్థులకు చెల్లించాల్సిన బాకాయిలు చెల్లించకపోవడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లోకేష్ చొరవతో రూ.20.50కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. మధ్యాహ్న బోజన పథకానికి రూ.110 కోట్లు కూటమిప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

జలజీవన్‌మిషన్‌కి 3025.63 కోట్లు



● గ్రామాల్లో సమృద్ధిగా తాగునీరు అందిస్తాం

● మంత్రి అనగాని

రేపల్లె, మార్చి11(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామాల్లోని ప్రజలకు సమృద్ధిగా అందించేందుకు జలజీవన్ మిషన్ కింద 3025.63కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించటం జరిగిందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి కోసం కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమంకోసం పనిచేస్తుందని తెలిపారు. జలజీవన్‌మిషన్ కింద గ్రామాల్లో మినీవాటర్‌స్కీమ్‌లు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు నూతన పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు నియోజకవర్గంలోని రేపల్లె,నగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాల్లో 97పనులకు గాను నిధులు మంజూరు చేయించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈగ్రామాల్లో ఆయా పనులను బట్టి రూ.10లక్షల నుంచి 50లక్షల వరకు నిధులు మంజూరుచెయ్యటం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వికాస ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 2025 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, ఇన్చార్జి రిజి స్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్, వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్‌లు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ గంగాదరరావు మాట్లా డుతూ ఉద్యోగులు ఇటువంటి క్రీడల ద్వారా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని అన్నారు. నిరంతరం విధులతో మానసిక ఒత్తిడికి గురవుతారని ఇటువంటి క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు పని ఒత్తిడి తగ్గుతుందని సూచించారు ఇటువంటి క్రీడలు ఉద్యోగుల పట్ల స్నేహభావం పెంపొందిస్తాయని అన్నారు. క్రీడలు నిరంతరం నిర్వహించాలని వికాస కార్యవర్గానికి సూచిం చారు. అనంతరం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వికాస అధ్యక్ష,కార్యదర్శులు నీలపు ప్రసాద్, జవ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కె. యేసయ్య, కార్యవర్గ సభ్యులు నాగరాజు,వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శశిధర్, తదితరులు పోటీల నిర్వహణను పర్యవేక్షించారు.

అట్టహాసంగా ప్రారంభమైన యూజీసీ సెమినార్

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్స్మెంట్స్ ఇన్ సాఫ్ట్వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్" అనే అంశంపై జరుగుతున్న సదస్సు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలా రాణి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కే విజయ కిషోర్ మాట్లాడుతూ ఈ సదస్సుకు సుమారు 500కు పైగా రిజిస్ట్రేషన్లు వివిధ యూనివర్సిటీలో మరియు కళాశాలల నుంచి వచ్చాయని తెలిపారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ సుశీల్ శర్మ మాట్లాడుతూ ఫార్మసీ, వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్యాన్ని వివరించారు. రెక్టార్ ప్రొఫెసర్ రత్న షీలా మణి విద్యార్థులకు ప్రత్యేక సందేశాన్ని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు సదస్సు సావనీరుని విడుదల చేసి ఆవిష్కరించారు.



వర్సిటీలో క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

29,30 తేదీలలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ సప్లై చైన్ అండ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సదస్సు బ్రోచర్ ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్య ప్రసంగికులుగా అమెరికాలోని వాల్టన్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ కొర్రపాటి రఘు హాజరుకానున్నారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో అంతర్జాతీయ మార్కెట్లో నూతనంగా వచ్చిన సప్లై లాజిస్టిక్ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్టర్ ఆచార్య జి. సింహాచలం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు కేసులో.. నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ

తెనాలి రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పేదలకడుపునింపేందకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిలో నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ పోలీసుల రికార్డులోకి ఎక్కా రు. మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ షేక్ సిలార్ జానీబాషా గత ప్రభుత్వంలో బంధువుల పేరుతో రేషన్ డీలర్ షిప్ పొందాడు. ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీకి స్వయంగా వెళుతూ లబ్ధిదారులకు బియ్యం నాణ్యమైనవి కాదని వాటిని తింటే అనారోగ్యసమస్యలు వస్తాయంటూ వారిలో రేషన్ పంపిణీ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి వేలిముద్రలు తీసుకుని బియ్యం బదులుగా కేజీకి రూ.8 నుంచి 10 వంతున ఇచ్చి పంపుతుంటాడు. ఇలా సేకరించిన బియ్యాన్ని నల్లబజార్లకు తరలించి సొమ్ముచేసుకునేవాడు. గత ప్రభుత్వంలో వైసీపీ చోటా నాయకుడు కావడంతో ఇతడివైపు అధికారులు కన్నెత్తికూడా చూసేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున సత్తెనపల్లి తరలించేందుకు రేషన్‌బియ్యాన్ని ట్రాన్స్‌పోర్ట్‌ఆటోలో లోడ్ చేసుకుని వెళుతుండగా పోలీసులను గమనించి వాహనాన్ని వెంబడించారు. దాంతో డ్రైవర్ వాహనాన్ని కొల్లిపర మండలం అత్తోట వైపు దారి మళ్లించాడు. పోలీసులు వాహనాన్ని వెంబడించి వాహనంలో ఉన్న 120 బస్తాల పీడీఎఫ్ బియ్యా న్ని అందులో ఉన్న డ్రైవర్, మరోవ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీటీసీ సిలార్ జానీబాషా వద్ద కొనుగోలు చేసి సత్తెనపల్లి తరలిస్తున్నట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. దీంతో తరలిస్తున్న ఇరువురిని, అమ్మిన సిలార్‌జానీబాషాను, కొనుగోలు చేసిన సత్తెనపల్లికి చెందిన మరో వ్యక్తిని కలిపి మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్ బియ్యంతో పట్టుబడ్డ ట్రాన్స్‌పోర్ట్ ఆటో

ఏప్రిల్ 30న రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశం : కలెక్టర్

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలైనా సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు జాతీయ, రాష్ట రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఏప్రిల్ 30వ తేదీన న్యూఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్‌వో, జిల్లా ఎన్ని కల అధికారి, సీఈవో స్థాయిలో పరిష్కారం జరగని సమస్యలను ఆ సమావేశంలో ప్రస్తావించ వచ్చన్నారు. గతంలో జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను ఈ నెల 31వ తేదీ లోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08479 భువనేశ్వర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 17, 24 తేదీల్లో మధ్యాహ్నం 12.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.50కి చర్లపల్లి చేరుకుంటుంది. నంబరు. 08480 చర్లపల్లి - భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో ఉదయం 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9.50కి భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

యూత్ పార్లమెంట్ రిజిస్ట్రేషన్ 16 వరకు పొడిగింపు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు ఈ నెల 16 వ తేదీ వరకు పొడిగించినట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయడానికి తేదీ పొడిగించారని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, యన్‌టి ఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన "వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ 'అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 16వ తేదీ అర్ధరాత్రిలోగా మై భారత్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలియచేశారు. వివరాలకు యూత్ పార్లమెంట్ నోడల్ అధికారి కిరణ్మయిదేవిరెడ్డిని (9849854221) సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగాలు ఇప్పించటం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో నల్లపాడు ఎంటీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 వ తేదీన ఈ కోర్సు తరగతులు మొదలవుతాయి, ఈ కోర్సుకు టెన్త్/ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు 6304292828 అనే నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆంధ్రప్రదేశ్ రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విశాల్ జైశ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆర్‌బీఐ విశిష్టతలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, అధ్యాపకులు ఆచార్య వి.చంద్రశేఖర్, ఏ. కనకదుర్గ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు,(కాపు, బలిజ,తెలగ,ఒంటరి), ఈబీసీ, కమ్మ,రెడ్డి,ఆర్యవైశ్యక్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ మయూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 522.10 అడుగులు ఉంది. ఇది 153.13 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,871 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

హైదరాబాద్ ఎడ్లజతకు ప్రథమస్థానం

రాజుపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల పందెలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన జూనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన డి రోహన్‌బాబు సామ్రాట్ బసవ ఎడ్లజత 2962 అడుగుల దూరంలాగి ప్రథమస్థానంలో, జగమెండి ఎడ్లజత 2790అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి ఎడ్లజత 2759.11అడుగుల దూరంలాగి మూడవస్థానంలో, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన ఆళ్ళ మెహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావుల ఎడ్లజత 2478.8అడుగుల దూరంలాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.


వ్యవసాయ విభాగంలో బాపట్ల ఎడ్లజతకు ప్రథమస్థానం

వ్యవసాయ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్లజత 4000 దూరంలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 3926.7అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలువగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య ఎడ్లజత 3893.6అడుగుల దూరంలాగి మూడవస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఆకులగణపవరం గ్రామానికి చెందిన పుట్టా తిరుపతయ్య ఎడ్లజత నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఎడ్లజత

ఉనికి కోసమే వైసీపీ పాట్లు : యరపతినేని



పిడుగురాళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎన్నికలలో రాష్ట్రంలో చిత్తు చిత్తుగా ఓడిన జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయాడని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలో వుండగా ప్రజల బాధలు, సమస్యలు ఉద్యోగుల బాగోగులు, హాస్టల్ విద్యార్థుల ఫీజులకు నిధులు విడుదల చేయని జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉనికి కోసమే యువత పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నాడన్నారు. యువతను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకొచ్చేందుకు జగన్ పిచ్చి పనులు చేస్తున్నాడని, జగన్ హయాంలో నిరుద్యోగం పెంచి ఇప్పుడు ఆపోరు ఈపోరు అంటూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చే ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్ మాట తప్పానని మొదటగా రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాల్సిన అవసరం వుందన్నారు. జగన్ అధికారంలో వుండగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 4,200 కోట్లకు పైగా బకాయిలు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి నారా లోకేష్ చొరవతో ఇప్పటికే 800 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు.

చంద్రయ్య హత్యపై సీఐడి విచారణ హర్షణీయం



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తోట చంద్రయ్య హత్యపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తోట చంద్రయ్య రెండెకరాల రైతు అని, తెలుగుదేశం పార్టీపై అభిమానం, అన్న ఎన్టీఆర్ పట్ల మమకారంతో పనిచేసే వాడని, అటువంటి చంద్రయ్యను ముక్కోటి ఏకాదశి రోజున పట్ట పగలు అందరూ చూస్తుండగా గ్రామంలోని నడి రోడ్డుపై అత్యంత పాశావికంగా గొంతు కోసి హతమార్చారని స్పీకరు రఘురామకృష్ణరాజు దృష్టికి తెచ్చారు. జై జగన్ అంటే చంపకుండా వదిలిపెడతామని ప్రత్యర్థులు బెదిరించినా జైచంద్రబాబు అంటూ ప్రాణాలు విడిచిన కార్యకర్త అని తెలిపారు. వైసీపీ పరిపాలన చంబల్‌లోయను మించి తాలిబన్ రాజ్యంను తలపించిందన్నారు. అప్పట్లో పల్నాడులో బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఫిర్యాది ముద్దాయి అవుతాడు.. ముద్దాయి ఫిర్యాదిదారు అవుతారని ఇంతకంటే దౌర్భాగ్యం రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలో మరెక్కడా ఉండదన్నారు. తనకు మొట్టమొదటిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు స్పీకరు రఘురామకృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జిందాల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 6 గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు 6.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారన్నారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె. చాందిని, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థి ఎమ్. వివేక్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు గుంటి పీటర్ పాల్, ఎమ్. అజయ్ శ్రీకృష్ణ, వర్ధన కె, వై. శ్యామ్ కుమార్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ .కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్‌అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ .కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీకు చెందిన 6వ సంవత్సరం విద్యార్థులు ఎస్‌కే. దెహనాజ్, ముషీర అనే ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో 4 వారాల అడ్వాన్స్డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలియజేసారు. టెన్నెస్సెలోని నాష్‌విల్లేలో అమెరికన్ ఫార్మా సిస్ట్ అసోసియేషన్ అన్యుల్ కన్వెన్షన్, ఓహియోలోని యూ నివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న ఫార్మాడీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో రెండు రీసెర్చ్ పేపర్లు ప్రచురించ డానికి వీరికి అనుమతి లభిం చిందని వెల్లడించారు. విద్యా ర్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,44,323 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,38,953 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,44,323 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,551 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నంబరు. 5	10000	14000
273	10000	13000
341	10500	14500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11000	12500
బ్యాడిగి 355	10000	14000
సింజెంటా		
బ్యాడిగి 5531	10500	12200
దేవనూరు డీలక్స్	11500	13500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	7500

త్రీ స్టార్ హోటల్‌కు అడ్డగోలుగా టీటీపీ మార్పు

- కార్పొరేషన్‌కి ఫీజ్ చెల్లించకుండానే..
- జీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌పై ఫిర్యాదు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఓ త్రీ స్టార్ హోటల్‌కు ఎటువంటి ఫీజ్ కట్టించుకోకుండా అడ్డగోలుగా టైటిల్ ట్రాన్స్‌ఫర్(టీటీపీ) జరిగిందని, దీనివల్ల జీఎంసీకి ఆర్థిక నష్టం జరిగిందని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త ఎల్.దుర్గా ప్రసాద్ నాయుడు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాసు నగరంలోని హోటల్‌కు అప్పనంగా టీటీపీ చేయటం వల్ల జీఎంసీకి భారీగా నష్టం జరిగిందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా ఆయన ఈ చర్యలు తీసుకున్నారని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. దీనిపై సత్వరం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు ఉచిత మెగా కిడ్నీ వైద్య శిబిరం

గుంటూరు, మెడికల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్థానిక మంగళదాస్‌నగర్, కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో ఉచిత మెగా కిడ్నీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్, డాక్టర్ వి.శరత్ చంద్ర పాల్గొంటారని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కిడ్నీ, యూరిన్ ఇన్ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు తొలగించుట, యూరిటర్‌లో రాళ్లు తొలగించుట, బ్లాడర్‌లో రాళ్లు తొలగించుట, కిడ్నీ క్యాన్సర్ సర్జరీ, యురేటర్ క్యాన్సర్ సర్జరీ, బ్లాడర్లో క్యాన్సర్ సర్జరీ, ప్రోస్టేట్ గ్రంధి తొలగించుట, మగవారిలో సంతానలేమి వంటి కేసులకు సంబంధించిన పరీక్షలు జరుగుతాయని అన్నారు. పురుగుమందు, విషం తాగిన వారికి ఎక్స్ట్రా కార్పోరియల్ చికిత్స ద్వారా విషాన్ని తీసివేయటం, షుగర్, అధిక రక్తపోటు వల్ల కిడ్నీలు పాడైన వారికి చికిత్స, చిన్నపిల్లల్లో వచ్చే ఉబ్బుకామెర్లు, ఎముకలు వంగిపోయే జబ్బులకు చికిత్స, కిడ్నీ బయాప్సీ సేవలు, డయాలసిస్ వాస్కులార్ వంటి ఉచిత వైద్య సేవలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14వ తేదీన జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం పోస్టరుని ఆ పార్టీ సీనియర్ నేతలు బోనబోయిన శ్రీనివాసయాదవ్, గాదె వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. స్థానిక లాడ్జీ సెంటర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. బోనబోయిన మాట్లాడుతూ మార్చి 14వ తేదీన సభను విజయవంతం చేసి ఎవరి ఊళ్లకు వాళ్లు క్షేమంగా తిరిగి చేరుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ఎవరి ప్రాంతాల్లో వాళ్లు సమావేశాలు ఏర్పాటు చేసుకొని జన సైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు అందరు సభకు హాజరయ్యేలా ప్రణాళికని రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, జిల్లా, నగర కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు తదితరులు

గొర్రెలు, మేకల పెంపకదారులకు తగిన నిధులు కేటాయించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు అభివృద్ధి-పెంపకం దారుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్టేలు పెంటయ్య అధ్యక్షతన మంగళవారం గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 25 శాతం ఉన్న 30 రకాల చేతిదారుల సంక్షేమం కోసం చేసిన కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నేషనల్ లైవ్ స్టాక్ పథకం రుణాలు కార్పొరేట్ కంపెనీలకే అందుతున్నాయని మండిపడ్డారు. అనంతరం గొర్రెలు, మేకల పెంపకం దార్ల సహకార ఫెడరేషన్ ఇన్‌చార్జీ డాక్టర్ రజనికుమారికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పలు సంఘాల నాయకులు పి.జమలయ్య, పి.నాగాంజనేయులు, బాలాజీ, కేవీ కృష్ణ గౌడ్, ఎం.కారన్న, కంచర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి : జంగాల

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేట, మల్లయ్యలింగం భవన్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న మంగళగిరిలో, 17న గుంటూరులో, 19న పొన్నూరులో, 20న తెనాలిలో అధికారులకు అర్జీలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో గని, కొల్లి రంగారెడ్డి, షేక్ వలి, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మలిశెట్టి లక్ష్మీనారాయణ బృందం స్వామి వారి కీర్తనలను ఆలపించారు. అనంతరం శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అర్చకులు పరుచూరి మాధవస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బ్రహ్మోత్సవాల సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. ఆనంద ఆశ్రమం పీఠాధిపతి ప్రసన్నానందగిరి స్వామి, బ్రహ్మనిష్ఠనంద సరస్వతి స్వామి వారు పాల్గొన్ని అనుగ్రహభాషణం చేశారు. అతిథులుగా విశ్రాంత మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ దేవినేని కరుణ చంద్రబాబు, విశ్రాంత న్యాయమూర్తి కె జి శంకర్, విశ్రాంత ప్రొఫెసర్ ముస్నోరి ఆరేటి కృష్ణకుమారి, బ్రహ్మకుమారి ఉమా పాల్గొన్నారు. ఉపన్యాసకులుగా గుదిమెళ్ళ శ్రీకూర్మనాధస్వామి, ఏవీకే సుజాత పాల్గొని ఉపన్యసించారు. ఆలయ కమిటీ సభ్యులు బొర్రా నాగేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రవచనం చేస్తున్న శ్రీ ప్రసన్నానందగిరి స్వామి, పాల్గొన్న బ్రహ్మకుమారి తదితరులు

రెండు రోజుల సమ్మెకు బ్యాంకు యూనియన్ల పిలుపు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో 9 బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఈ నెల 23, 24 తేదీలలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యుఎఫ్‌బీయూ) తరఫున బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె సందర్భంగా దేశవ్యాప్తంగా యుఎఫ్‌బీయూ వివిధ బ్యాంకుల కార్పొరేట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, జోనల్, రీజనల్ కార్యాలయాల ఎదుట మంగళవారం బ్యాంకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

తమ డిమాండ్లలో ముఖ్యంగా బ్యాంకులోని అన్ని విభాగాలలో తగిన రిక్రూట్ మెంట్, వారానికి 5 రోజుల పనిదినాలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్ మెన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టుల భర్తీకి కూడా యుఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తోంది. ఎస్‌బీఐ గుంటూరు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమానికి ఎస్బీఈఅ తరఫున నరేంద్రకుమార్, పిఎస్ రంగసాయి, షేక్ ఇబ్రహీం, ఏఐబీఈఏ తరఫున పి కిషోర్, మహమ్మద్ సయ్యద్ బాషా, ఏఐబీఓసీ సునీత, కళ్యాణ్, రాంబాబు, బెఫి స్టేట్ ప్రెసిడెంట్ ఎమ్. సాంబశివరావు, సీపీఐ తరఫున శివాజీ, మిగిలిన నాయకులతో పాటు వివిధ శాఖల మెంబర్స్ పెద్దఎత్తున పాల్గొని తమ నిరసనను తెలియపర్చారు.

ప్రజారోగ్య విభాగం పటిష్టతకు ప్రణాళికబద్ధమైన చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు


వాహనాల షెడ్‌లో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, ఇప్పటికే ప్రజారోగ్య విభాగం పటిష్టతకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ తొలుత జీఎంసీ వెహికిల్ షెడ్‌ని పరిశీలించి, పారిశుధ్య పనులకు డివిజన్ల వారీగా కేటాయించిన ట్రాక్టర్లు, పుష్ కాట్స్, ఈ-ఆటోల గురించి ఇన్‌స్పెక్టర్లను సెట్ ద్వారా అడిగి తెలుసుకొని మాట్లాడుతూ చెత్త తరలింపునకు వాహనాలు అందుబాటులో లేవనే సమస్య రాకుండా డివిజన్లకు వాహనాలు అందించామని తెలిపారు. షెడ్‌కి మరమ్మతులకు వచ్చిన వాహనాలను వేగంగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సంగడి గుంట, కొత్తపేట, రైలుపేటల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేసి, మైక్రో ప్యాకె ట్స్ ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. జీటీ రోడ్డులో స్వీపింగ్ మెషిన్‌ల పనితీరు పరిశీలించి, మెయిన్ రోడ్ల డివైడర్ల పక్కన పరిశుభ్రంగా ఉండేలా ప్రతి రోజు స్వీపింగ్ జరగాలన్నారు. పర్యటనలో ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు సంతృప్తికరంగా అన్న క్యాంటీన్లో ఆహారం

అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకుంటున్న ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ, రూ.5తో ఆకలి తీరుస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మిర్చి యార్డు దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని మంగళవారం పరిశీలించి, ప్రజలతో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మిర్చి యార్డు దగ్గరలోని క్యాంటీన్‌లో పూటకు 500 మందికి పైగా ఆహారం తీసుకుంటున్నారన్నారు. ప్రజలు క్యాంటీన్‌లో అందే ఆహారంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

కలెక్టర్ ఆఫీస్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

నగరంలోని శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు ప్రారంభం దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రజా సౌకర్యార్థం హిందూ కాలేజి జంక్షన్ నుంచి నగరంపాలెం, పట్టాభిపురం మెయిన్ రోడ్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల జంక్షన్ వరకు రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు చేపట్టామని, ఆక్రమణలు పునరావృతం కాకుండా నిరంతరం పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ చేస్తారని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు మంగళవారం ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్యలు ఎదురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరగా కొందరు తొలగించుకున్నారని, తొలగించుకోని వాటిని మంగళవారం ఒకవైపు తొలగిస్తున్నామని, బుధవారం మరో వైపు కూడా తొలగిస్తామని తెలిపారు.

డాక్టర్ స్వర్ణ లతాదేవికి ఆత్మీయ సత్కారం

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదగా ఆదర్శ మహిళ అవార్డు అందుకున్న డాక్టర్ స్వర్ణలత దేవిని మంగళవారం దళిత, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాషువా కల్చరల్ సెంటర్ కార్యదర్శి, ప్రజాగాయకుడు పీవీ రమణ మాట్లాడుతూ ఈ పురస్కారం రావడం దళితులకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నట్టు అన్నారు. ఆదర్శ మహిళ పురస్కార గ్రహీత డాక్టర్ స్వర్ణలతదేవి మాట్లాడుతూ పురస్కారానికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమ్ సేన సేవాదళ్ అధ్యక్షుడు నీలాంబరం, కార్మ్ కళాశాల కరస్పాండెంట్ ఎం.సత్యవాణి, సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ పాల్గొన్నారు.

14 నుంచి తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసరావుపేట 9/1వ లైనులో ఉన్న శ్రీ తిరుపతమ్మ తల్లి దేవస్థానంలో 30వ తిరునాళ్ళ మహోత్సవాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 14న అమ్మవారి దేవస్థానంలో అఖండ జ్యోతి స్థాపన, 15న మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి నగర రథోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. 16న సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమ కార్యక్రమం, 17న సాయంత్రం 7 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు. 18న ఆలయం ఎదుట పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

పోలేరమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

చుట్టుగుంట చెరువు పక్కన ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా వార్షిక మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి ఉదయం 108 బిందెలతో, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

నేత్రపర్వంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, శ్రీ చక్రమేరుకు విశేష అభిషేకాలు అర్చనలు జరిగాయి. అనంతరం కల్యాణాల్లో భాగంగా సంతానలక్ష్మీ, నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. మహాహారతి, మంత్రపుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్ని ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు, ధర్మకర్త మర్రిపాటి పార్థసారధి పర్యవేక్షించారు.

తైక్వాండో పోటీలకు ఎంపికైన కేఎల్‌పీ విద్యార్థులు

గుంటూరు(విద్య), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రింగురోడ్డులోని కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు ఈనెల 23న జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కార్యదర్శి కొండబోలు కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తరగతి విద్యార్థిని సిహెచ్ పూజిత, 6వ తరగతి విద్యార్థి సిహెచ్ పవన్ కళ్యాన్‌లు ఈనెల 9వ తేదీన ఎంసీఎంఈ స్కూల్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని విజయం సాధించారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏవో వెంకటరావు, తైక్వాండో శిక్షకులు బి.కాశి, బి సాయి అభినందించారు.

నేడు 'యువత పోరు' పేరుతో వైసీపీ నిరసన

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యువత పోరు పేరుతో వైసీపీ బుధవారం నిరసన కార్యక్రమాన్ని తలపెట్టింది. నగరంలోని స్వామిథియేటర్ సెంటర్ నుంచి విద్యార్థులు, కార్యకర్తలతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత పోరు ర్యాలీ కోసం ఎస్పీకి ఇప్పటికే లెటర్ ద్వారా సమాచారం ఇచ్చామని, ర్యాలీకి ఎస్పీ అనుమతి ఇచ్చారని తాము భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యార్థులను, తల్లిదండ్రులను, విద్యాసంస్థలను మోసం చేసిందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్‌లో ఉత్సాహంగా జరిగింది. 50 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులు ఒకచోట చేరి నాటిజ్ఞాపకాలు గుర్తుచేసుకుని సందడి చేశారు. 1964-75 మధ్య చదివిన విద్యార్థులు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. మాస్టార్లు రాఘవేంద్రరావు, స్వరాజ్యలక్ష్మిని ఈ సందర్భంగా సత్కరించారు. రఘు కుమార్, పతంజలి, నరహరిరావు, సంధ్యశ్రీ, వరలక్ష్మి, అపర్ణ పాల్గొన్నారు.

పద కవితా వారసత్వ సంపద అందించిన బాలకృష్ణప్రసాద్

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి పదకవితా వారసత్వ సంపదను అందించిన దీపధారి, గంధర్వుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ చిరస్మరణీయులని సీనియర్ ఇంజనీర్ ఎన్ సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ సంగీత విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ఆర్తిని, భక్తిని తన గొంతులో ఇమిడ్చి, సామాన్య ప్రజలకు ఆయన్ను ఆప్తుడిని చేసిన ఖ్యాతి గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌కే దక్కుతుందన్నారు. గరిమెళ్ళ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, శారద, యార్లగడ్డ లక్ష్మి, రాజేశ్వరి, మల్లేశ్వరరావు, పీఎస్ మూర్తి తదితరులున్నారు.

సంపత్‌నగర్, సాయి రాఘవేంద్ర నిలయంలో...

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాదు లేని లోటు భక్తి రంగంలో తీర్చలేనిదని పలువురు సంతాపం ప్రకటించారు. సంపత్‌నగర్, సాయి రాఘవేంద్ర నిలయంలో గరిమెళ్ల సంస్మరణ సభ జరిగింది. అనంతరం సర్వరాగ సుధ సంస్థ నిర్వాహకులు సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కే వి సాయిబాబు శర్మ, కృష్ణకుమారి, సాంబశివరావు, రామచంద్రరావులు పలు అన్నమయ్య గీతాలను ఆలపించారు.


విశ్రాంత డీజీపీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ శివాజీ తదితరులు

పోలీస్ శాఖలో వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం

- మాజీ ఎంపీ యలమంచలి శివాజీ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో వెంకటేశ్వరరావు అందించిన సేవలు ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ తెలిపారు. రాష్ట్ర మాజీ డీజీపీ ఏవి వెంకటేశ్వరరావు మంగళవారం శ్రీ పాటిబండ్ల హైస్కూల్‌లో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీని మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పెనమలూరు కేఎస్ఎస్ విద్యాలయం వ్యవస్థాపకులు తాతినేని విద్యాసాగర్, పురప్రముఖులు దాసరి హనుమంతరావు, అత్తోట సుబ్బారావు, జొన్నలగడ్డ రామారావు, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కమిటీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, మదమంచి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో శునకాలు పట్టివేత

- అడ్డుకున్న జీవ రక్షా సంఘం ప్రతినిధులు

గుంటూరు మెడికల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రెండు రోజుల వ్యవధిలో ఏకంగా 51 శునకాలను పశు వైద్యశాల సిబ్బంది పట్టుకొని బయటకు తరలించారు. గుంటూరు నగర పాలక సంస్థతో పాటు జిల్లా పశు వైద్యశాల సిబ్బంది సహకారంతో ఆసుపత్రిలో సోమవారం 12, మంగళవారం 39 కుక్కలను బంధించారు. ప్రభుత్వాస్పత్రిలో కుక్కలను పట్టుకుంటున్నారని సమాచారం తెలియడంతో...జీవ రక్షా సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అక్కడకు చేరుకొని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో వాదనకు దిగారు. తాము వాటికి యాంటీ ర్యాబీస్ టీకాలు వేసి విడిచిపెడతాని వైద్యాధికారులు చెప్పినా, ఆమె శాంతించలేదు. ఎట్టకేలకు వాటిని తిరిగి సంఘం ఎదుట హాజరుపెడతామని హామీ ఇవ్వడంతో మంజుల వెనుదిరిగారు. అనంతరం ఆసుపత్రిలో పట్టుకున్న 51 కుక్కలను వాహనంలో కొత్తపేటలోని పశు వైద్యశాలకు తరలించి యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసి విడిచిపెట్టారు.

ప్రభుత్వానికి లేఖ...

ఆసుపత్రిలో భారీ సంఖ్యలో సంచరిస్తున్న శునకాలు..ప్రసూతి విభాగం, శిశు వైద్యవిభాగం దగ్గర తచ్చాడటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కుక్కలను బయటకు తరలిస్తున్న తమ ప్రయత్నాలను జీవ రక్షా సంఘం నేతలు అడ్డుకోవడంపై వైద్యాధికారులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై తాము ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలియజేయాలని మంగళవారం ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వాస్పత్రిలోకి జంతువులు ప్రవేశించకుండా నిరోధించేందుకు ప్రధాన ప్రవేశ ద్వారం దగ్గర స్ట్రే యానిమల్ గేట్లను ఏర్పాటు చేయాలని కోరారు.

ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలకు జిల్లాల కేటాయింపు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొంది శిక్షణ సపూర్తి చేసుకున్న 11 మందికి రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు ఇచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయా ఎస్ఐలతో ఐజీ భేటీ అయ్యారు. అనంతరం వారికి జిల్లాలు కేటాంచారు. ఎస్.శ్రీనివాస్‌రెడ్డి నెల్లూరు జిల్లా టు తిరుపతి జిల్లాకు, వి.ఎన్.మల్లేశ్వరరావు బాపట్ల జిల్లా టు గుంటూరు జిల్లా, పి.ప్రమీల గుంటూరు జిల్లా, ఆర్.కొండయ్య ప్రకాశం జిల్లా టు గుంటూరు జిల్లా, డి.రాజ్యం గుంటూరు జిల్లాకు, డి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లాకు, పి.సుబ్బారావు బాపట్ల జిల్లా టు గుంటూరు జిల్లా, బీ.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా టు గుంటూరు జిల్లా, వై.రాజులు, ప్రకాశం జిల్లా టు గుంటూరు జిల్లా, ఎండి.అబ్దుల్ హఫీజ్, ప్రకాశం జిల్లా టు గుంటూరు జిల్లా, షేక్.ఎస్.రసూల్ ప్రకాశం జిల్లా టు గుంటూరు జిల్లా. వివిధ ఏఆర్ ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన పోలీస్ సిబ్బంది, ప్రస్తుత జిల్లా మరియు వారు కేటాయింపబడిన జిల్లాలు ఇలా ఉన్నాయి... పి.మోహన్‌రావు నెల్లూరు జిల్లా, షేక్.మస్తాన్, నెల్లూరు జిల్లా టు తిరుపతి జిల్లా, కే.శివకుమార్, నెల్లూరు జిల్లా టు పల్నాడు జిల్లా, కే.శీను నెల్లూరు జిల్లా టు తిరుపతి జిల్లా కేటాయించారు.

జేకేసీలో నెక్స్ట్‌జెన్ మార్కెట్ మేకర్స్ పోటీలు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నెక్స్ట్‌జెన్ మార్కెట్ మేకర్స్ అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.గోపిచంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో 350 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో మౌనిక (బీబీఏ తృతీయ సంవత్సరం), కమల్ అండ్ టీమ్(బీకాం తృతీయ సంవత్సరం), జైన్ అండ్ టీమ్(తృతీయ సంవత్సరం బీకాం కంప్యూటర్స్) విద్యార్థులు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారని వివరించారు. విద్యార్థులను పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ తదితరులు అభినందించారు.

పాఠశాలల్లో 'విధుల' దినోత్సవాన్ని నిర్వహించాలి

- అసెంబ్లీలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి
- పరిగణనలోకి తీసుకుంటామన్న మంత్రి లోకేశ్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'ప్రాథమిక విధు ల' దినోత్సవాన్ని ప్రతి పాఠశాలలో విధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మం గళవారం జీవో 117 రద్దుపై జరిగిన చర్చలో ఆమె ప్రసంగించారు. జీవో నెం.117 రద్దుతో ఉపాధ్యాయులకు ఊరట చేకూర్చటం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. మంత్రిగా లోకేశ్ బాధ్యతలు తీసుకున్న వెంటనే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌తో ఒక బాధ్యతయుతమైన కార్యక్రమం చేపట్టటం హర్షణీయమన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యా హ్న భోజనం పెడుతున్న మంత్రి లోకేశ్‌కు విద్యార్థులు తరఫున ఆమె ధన్యవా దాలు తెలిపారు. అమ్మఒడి పథకాన్ని 40 లక్షల మంది పిల్లలకు ఇవ్వకుండా, ఫీజులు చెల్లించకుండా జగన్ వంచించాడని, నాడు-నేడులో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఆమె విమర్శించారు. నాడు-నేడు పేరుతో నిధులు దుర్వినియోగం వలన పశ్చిమ నియోజకవర్గంలో 31 స్కూళ్లలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు గురించి కూడా ఆమె చర్చించారు. ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తేవాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరా రు. ప్రాథమిక విధుల దినోత్సవ ప్రాధాన్యాన్ని ఆమె సభలో చర్చకు తెచ్చారు.

దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. ప్రాథమిక విధుల దినోత్సవ విషయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేసిన సూచన చాలా విలువైనదని, దానిని పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

- తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక ప్రగతి, స్వావలంబన సాధించినప్పుడే కుటుంబం, తద్వారా రాష్ట్రం బాగుంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ఐదేళ్లలో సున్నా వడ్డీ రుణాల పరిమితి రూ.3 లక్షలు మాత్రమేనని, ప్రస్తుతం దాన్ని రూ.5 లక్షలకు పెంచామని చెప్పారు. దానికోసం బడ్జెట్లోనే రూ.1,250 కోట్లు కేటాయించామన్నారు. డ్వాక్రా గ్రూపుల్లోని ఎస్సీ, ఎస్టీ సభ్యురాలికి రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో రూ.10 లక్షలకు పెంచనున్నట్లు వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు 35 శాతం నుంచి 45 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని తెలిపారు. పెళ్లికానుక రద్దు చేసి, అంగన్వాడీలను వంచించి, తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్‌కు అక్క, చెల్లెమ్మల పేరు ఉచ్చరించడానికి అర్హత ఎక్కడిది అంటూ ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. అంగన్వాడీల జీతాలు చంద్రన్న రూ.6,300 పెంచగా, జగన్ రూ.1000 మాత్రమే పెంచారని గుర్తు చేశారు.

జగన్ ఇంటి ముందు 'యువత పోరు' చేయాలి

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యా దీవెన ఇవ్వకుండా విద్యార్థులను వంచించిన జగన్‌రెడ్డి ఇంటి ముందు వైసీపీ ముఠా 'యువత పోరు' చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.450 కోట్లు బకాయిలు పెట్టి, బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని నీచరాజకీయాలు నడుపుతున్న వైసీపీ దొంగల ముఠా నాయకుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల వ్యవధిలోనే 6.5 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని, తద్వారా 4 లక్షల మందికి ఉపాధి లభించబోతోందని చెప్పారు. విద్యార్థుల పరీక్షల సమయంలో పోరుబాటల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడం జగన్‌కే చెల్లుతుందన్నారు. పోరుబాట కార్యక్రమం తాడేపల్లిలోని సైకో ప్యాలెస్ ముందు చేయాలని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో తెలుగు విద్యార్థి నాయకులు రాయపాటి అమృతరావు, కుంచకర్ల ధర్మతేజ, మహేంద్ర, ప్రశాంత్, నాగార్జున, వంశి, భార్గవ్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మన్నవ వంశీకృష్ణ

ప్రకృతి వ్యవసాయం ఆధునికమైనది

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అందరూ అనుకుంటున్నట్లు ప్రకృతి వ్యవసాయం పురాతనమైనది కాదని, ఆధునికమైనదని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగ స్వామ్య ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఖరీఫ్‌లో ప్రధాన పంటకన్నా ముందుగా పీఎండీయస్ విత్తనాలు వేయాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతంగా పూర్తి చేయటానికి పీఎండీఎస్ కిట్స్ తయారీలో కావాల్సిన నిధుల సమీకరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ పీఎండీఎస్ వలన పంటలు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థీమటిక్ లీడ్ గోపి చందు, రైతు సాధికార సంస్థ ఎన్ఆర్‌ఓ టీమ్ శ్రీనివాసరావు, బాజీ బాబు, హర్షిత, తెనాలి, పొన్నూరు డివిజన్లకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పీఎండీఎస్ కిట్స్ తయారీకి అవసరమైన నిధులను సమకూర్చేందుకు అంగీకార పత్రం ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ రాజకుమారికి అందజేస్తున్న డీఆర్ డీఏ పీడీ విజయలక్ష్మి

14న జరిగే నిరసనలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జిల్లా కేంద్రాల వద్ద 14న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు పిలుపునిచ్చారు. స్థానిక పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, కూరపాటి కోటయ్య, మేకల రవి, ముత్యాలరావు, కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సఖి నివాస్ సిద్ధం



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, ఫైర్ సేఫ్టీ సిలిండర్



కిచెన్ రూమ్



సఖి నివాస్..

- నిరీక్షణకు ఎట్టకేలకు తెర
- గత టీడీపీ ప్రభుత్వంలో మొదలైన పనులు
- ఎన్నికల నాటికి తుది దశకు చేరిన వైనం
- వైసీపీ రాకతో భవనానికి గ్రహణం
- కూటమి ప్రభుత్వం రాకతో జీవం..
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



డార్మెటరీ గదిలో పడకలు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పని చేసుకునే మహిళలు, చదువుకునే విద్యార్థినులకు భద్రతతో కూడిన ఆశ్రయాన్ని కల్పించే 'సఖి నివాస్' భవనానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ సఖి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ సఖి నివాస్ మహిళలు, విద్యార్థినులకు అందుబాటులోకి రావడానికి దాదాపు ఏడేళ్ల సమయం పట్టింది. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే.

2019 నాటికే తుది దశకు నిర్మాణం

నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి పొందే మహిళలకు చౌకగా భద్రతతో కూడిన ఆశ్రయం కల్పించడంలో భాగంగా కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 'సఖి నివాస్'లను ఏర్పాటు చేయడానికి పూనుకుంది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కావడంతో కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం వాటాలతో సఖి భవనాలను నిర్మిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ హాస్టళ్లను నిర్మించి మహిళలకు అందుబాటులోకి తేవాలని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ క్రమంలో గుంటూరు జిల్లాలో దాదాపు రెండున్నర కోట్ల వ్యయంతో మహిళా ప్రాంగణంలో ఈ హాస్టల్‌ను నిర్మించేందుకు పూనుకున్నారు. 2019 నాటికి నిర్మాణం తుది దశకు చేరింది. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిం ది. హాస్టల్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వచ్చినా, మౌలిక సదుపాయాలు కల్పించి దాన్ని వినియోగంలోకి తేవడానికి గత ప్రభుత్వానికి మనసు రాలేదు. దీంతో ఐదేళ్లపాటు ఆలన, పాలన లేకుండా నిర్మాణం పడి ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొరవ పనులు పూర్తి చేశారు. త్వరలో హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

90 మందికి ఆశ్రయం

ఉద్యోగినులు, పని చేసుకునే మహిళలు, విద్యార్థినులకు 24 గంటలపాటు భద్రత కల్పించే విధంగా హాస్టల్‌ను నిర్మించారు. మొత్తం 4 డార్మెటరీల్లో 90 మందికి ఆశ్రయం కల్పించే అవకాశం ఉండగా, తొలి విడతగా 50 మందికి నివాస ఏర్పాట్లు చేశారు. సింగిల్, డబుల్, ఐదుగురు సభ్యుల బెడ్‌రూమ్‌తోపాటు డార్మెటరీలు అందుబాటులో ఉన్నాయి. కేటగిరీ- 1 డార్మెటరీలో నాన్ ఏసీ గదులకు నెలకు రూ. 1200, ఏసీ గదులకు రూ.1,800, కేటగిరీ- 2 ఫైవ్ షేరింగ్ గదుల్లో నాన్ ఏసీ గదికి రూ.1,800, ఏసీ గదికి రూ.2,500 అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ అద్దెలు నిర్ణయించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఆ బెడ్ రూములు బుక్ అయిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా భోజనానికి సంబంధించి డ్వాక్రా గ్రూపులకు బాధ్యతలు అప్పగించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

సదుపాయాలు..

- విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంటర్నెట్, వైఫై సదుపాయాన్ని కల్పిస్తున్నారు.
- 24 గంటల నీటి సదుపాయం అందుబాటులో ఉంటుంది. తాగునీటి కోసం ప్రత్యేకంగా ఆర్వోమిషన్ ఏర్పాటు చేశారు.
- స్నానం చేసేందుకు వేడినీళ్ల సదుపాయం ఉంది. దుస్తులు ఉతుక్కోవడానికి వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు.
- రక్షణ కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.
- వ్యాహ్యాళి (రిక్రియేషన్) కోసం టీవీ ఏర్పాటు చేశారు. చదువుకునేందుకు, స్వయం ఉపాధి పనులు చేసుకునేవారికి ప్రత్యేకంగా ఒక హాల్ ఏర్పాటు చేస్తున్నారు.



రిక్రియేషన్ రూమ్



డైనింగ్ హాల్

అవకతవకలపై.. అలసత్వం

(5వ పేజీ తరువాయి)

అద్దెకిచ్చిన దాఖలాలే లేవు. ఇలా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయడంలో గోప్యత పాటించడంతో పాటు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంలోనూ వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇష్టారీతిన వైసీపీ తన అనుయాయులకు దోచిపెట్టినా వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ యంత్రాల యూనిట్ల విషయంలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదు. సదరు యూనిట్ల కోసం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పటి ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

రైతులకు వ్యక్తిగతంగా రాయితీ యంత్రాలను 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చింది. గ్రూపులకు యంత్రపరికరాల యూనిట్లు ఇచ్చేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే రాయితీ పరికరాల జాబితా ట్రాక్టర్ లేకపోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దానిని తిరిగి చేర్చారు. ఆ తర్వాత రాయితీ విషయంలో అస్పష్టత, యంత్రాలను అందించే కంపెనీల ఎంపికలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి 15 లక్షల యంత్రాలను అందించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం ప్రభుత్వమే రాయితీ ఇవ్వగా, మిగిలిన పది శాతం ఆయా గ్రూపు సభ్యులే భరించాలి. సదరు యూనిట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచి అవసరమైన రైతులకు నామమాత్రపు అద్దెకు ఇవ్వాలి. ఇందుకు ఎంతమంది రైతులు వాటిని వాడుకున్నారనే అంశంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు కూడా నిర్వహించాలి. వసూలు చేసిన అద్దె విషయంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలన్నది నిబంధన విధించారు. మొత్తమ్మీద ప్రతిదశలోనూ అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం నడిపింది. చివరకు బాపట్ల జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాల పరిధిలో 270 చోట్ల మాత్రమే యూనిట్లను మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో 249కు 205 చోట్ల, పల్నాడు జిల్లాలో 421 కేంద్రాలకు 290 కేంద్రాల్లో రాయితీపై యంత్రపరికరాల యూనిట్లకు పంపిణీ చేసింది. అయితే ఆయా యూనిట్లలో దాదాపు సగం చోట్ల ట్రాక్టర్లు లేకుండానే మమ అనిపించారు. కనీసం వీటి ఎంపిక అయినా పారదర్శకంగా జరిగిందంటే దాదాపు 50 శాతం యూనిట్లు సేద్యంతో ఏ మాత్రం సంబంధం లేని వైసీపీ నేతల అనుచరగణం వద్దనే ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల వద్దే పరికరాలను ఉంచాలనే నిబంధనకు పాతరేసి సొంత ఆస్తిలాగా తమ ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులకు యంత్రాల అవసరమొస్తే వారి ఇళ్ల ముందు పడిగాపులు కాసే పరిస్థితి తీసుకొచ్చారు. రైతులపై కూడా పార్టీ ముద్ర వేసి రాయితీ యంత్రాల ఫలాలకు దూరం చేశారు.

గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్‌ని

ఆదాయవనరుగా మార్చుకోవాలి

- గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ



రైల్వే వారోత్సవంలో షీల్డ్‌ను ప్రదానం చేస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంటూరు రైల్వే డివిజన్ పరిధి తగ్గిపోతున్నది. ఈ నేపథ్యంలో లోడింగ్, ఆదాయంలో ఏర్పడబోయే లోటుని గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్ ద్వారా పూడ్చుకోవాల్సి ఉందని రైల్వే గుంటూరు డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ అన్నారు. ఆ రీజియన్‌లో ఆదాయ వనరుగా మార్చుకోవాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో 69వ రైల్వే వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ చెట్టినాడు సిమెంట్స్, శ్రీ సిమెంట్స్ సైడింగ్‌ల ద్వారా లోడింగ్‌లు పెంచుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం రైల్వే ఉద్యోగులంతా కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం జనరల్ మేనేజర్ స్థాయిలో మూడు అవార్డులు, రైల్వే బోర్డు స్థాయిలో ఒక అవార్డును సాధిం చినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అవార్డులు పొందిన వారిలో వీ అలివేలు మంగమ్మబాయి(అకౌంట్స్), పీ శ్రీనివాస్, టీ బ్రహ్మ రెడ్డి, ఎం రాహుల్(సివిల్ ఇంజనీరింగ్), వేజండ్ల సరిత (కమర్షియల్), ఎస్ సోమునాయుడు(ఎలక్ట్రికల్ టీఆర్‌డీ), జీ రత్నం(ఎలక్ట్రికల్ మెయిన్‌టెనెన్స్), ఏ శ్రీనివాసరావు, టీమవరపు సాయిరాం(మెకానికల్), నంబూరి వెంకటేశ్వర రావు (మెడికల్), చిరబోయిన శ్రీనాథ్, లింగాబత్తుని సోనిబాబు (ఆపరేటింగ్), రెడ్డి శ్రీనివాసు(పర్సనల్), బోను వెంకటరమణ(సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే సైమన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీ వీ రమణయ్య, సీనియర్ అధికారులు జేవీ అనూష, షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీడీల విధానంలోనే ప్రశ్నపత్రాలు

సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు వెల్లడి

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టటానికి సీడీల విధానంలో ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు అందించే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామని పీజీ ప్రొఫెషనల్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రతిరోజు పరీక్ష ప్రారంభానికి అరగం ట ముందు పాస్‌వర్డ్‌ను పరీక్షా కేంద్రాల చీఫ్‌లకు పంపటం జరిగిందని చెప్పారు. పాస్‌వర్డ్ అందిన వెంటనే అభ్యర్థుల సమక్షంలో సీడీలను ఓపెన్ చేసి ప్రశ్నపత్రాలను ప్రింట్ తీయాల్సిందిగా పరీక్షల ప్రారంభానికి కొన్ని రోజులు ముందుగానే (సీడీలు అందచేసిన సమయంలోనే) పరీక్ష కేంద్రాల చీఫ్ లకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ప్రశ్నపత్రాల ముద్రణ ఖర్చు తగ్గించుకోవాలనే దురుద్దేశంతో అనాలోచితంగా సీడీల విధానం తెచ్చారన టంలో వాస్తవం లేదని,అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగిం చుకొని బీఈడీ పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు సీడీలు విధానం తెచ్చామని ఆయన చెప్పారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్

చర్లపల్లి నుంచే లింగంపల్లికి బైపాసు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం లింగంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్, గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25వ తేదీ నుంచి చర్లపల్లి నుంచి లింగంపల్లికి బైపాసు కానుంది. ఈ మేరకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లికి సాయంత్రం 6.05కి చేరుకొని 6.10కి బయలుదేరి బైపాసు మార్గంలో ప్రయాణించి నేరుగా రాత్రి 7.40కి లింగంపల్లి చేరుకొంటుంది. నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26వ తేదీ నుంచి లింగంపల్లిలో ఉదయం 6.15కు బయలుదేరి బైపాసు మార్గంలో 7.15కి చర్లపల్లికి చేరుకొని రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది. ఈ రైలుకు సికింద్రాబాద్, బేగంపేట నిలుపుదలను ఎత్తేశారు. అలానే నంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి, నంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లు కూడా సికింద్రాబాద్, బేగంపేట మార్గంలో కాకుండా చర్లపల్లి నుంచి నేరుగా లింగంపల్లికి చేరుకొంటాయి. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని రైల్వేబోర్డు విజ్ఞప్తి చేసింది.

నెలాఖరు వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ అనంతపురం వరకే..

ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం పనుల నిమిత్తం నంబరు. 17215 మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 12 నుంచి 30వ తేదీ వరకు అనంతపురం వరకే నడపడం జరుగుతుందని డీఆర్‌ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా నంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయలుదేరి గుంటూరు మీదగా మచిలీపట్నం చేరుకొంటుందన్నారు. ఈ సవరణలను ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రోన్లతో జూదరుల ఆటకట్టు

- పేకాట శిబిరాలపై పోలీసుల సాంకేతిక దాడి
- అదుపులో పదిమంది.. 10 వేల నగదు స్వాధీనం



డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించిన పేకాట శిబిరం



పేకాట శిబిరం వద్ద ఎగురుతున్న డ్రోన్ కెమెరా



డ్రోన్ కెమెరాను గుర్తించి పరుగులు తీస్తున్న జూదరులు

చుండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేకాట సమాచారం అందినా పోలీసులు అక్కడకు వెళ్లే సరికి వారు పారిపోతుం టారు. జూదరుల నెట్‌వర్క్ ముందు పోలీసుల శ్రమ వృథా అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా జూదరుల ఆట కట్టించాలనుకున్న చుండూరు పోలీసులు అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికతను వినియోగిస్తున్నారు. డ్రోన్ కెమెరాల ను వినియోగించి జూద శిబిరాలను గుర్తించి అందిపుచ్చు కుంటోన్న జూదరుల ఆటకట్టిస్తోంది. మండల పరిధిలోని యడ్లపల్లి, దుండిపాలెంలోని నిమ్మతోటల్లోని పేకాట శిబిరాలు విస్తృతంగా ఉన్నాయి. పేకాట గురించి తెలిసినా పోలీసులు తోటల్లోకి బైక్‌లపై వెళ్లే అవకాశం లేదు. నడిచి వెళ్లాలంటే 40 నిమిషాలు సమయం పడుతుంది. కొత్త వారి కదలికలపై ప్రత్యేకంగా నిఘాకు మనుషులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎన్ని సార్లు దాడులు చేసినా పోలీసులకు జూదరులు దొరికేవారు కాదు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ఎస్పీ తుషార్‌డూడీ ఏర్పాటు చేసిన ప్రత్యేక టీమ్, చుండూరు పోలీసులు కలిసికట్టుగా మంగళ వారం యడ్లపల్లి నిమ్మతోటల్లోని జూద శిబిరాలను డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి పేకాడుతున్న 20 మందిని గుర్తించారు. ఇంతలో డ్రోన్ కెమెరాను గుర్తించిన జూదరులు పారిపోయేందుకు ప్రయత్నించగా అప్పటికే చుట్టుముట్టిన పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రహిమాన్ తెలిపారు.



ఉదయం హంస వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు

హంస, గజ వాహనాలపై

శ్రీవారి గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి మంగళవారం రెండు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హంస వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పాలను, నీటిని వేరు చేసే స్వచ్ఛమైన పాలనుగ్రోలు హంస వలె భక్తుల పాపాలను వేరుచేసి పుణ్యాత్ములుగా చేసేందుకు శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని అర్చకస్వాములు వివరించారు. ఈ ఉత్సవానికి వేదాంత వెంకట రమణాచార్యులు జ్ఞాపకార్థం భార్య గోపాల సత్యవతి, కుమారుడు వేణుగోపాల వాసుదేవ భట్టర్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. సాయంకాలం స్వామి గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. గజ వాహన ఉత్సవాన్ని దర్శించిన యెడల మొసలి బారి నుంచి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధంగా సంసారమనే మొసలి బారి నుంచి తన భక్తులను కాపాడి రక్షించి ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవానికి పాతమంగళగిరి పద్మశాలీయ సంఘం వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.4 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 40, రేపల్లెకాల్వకు 140, తూర్పుకాల్వకు 272, పశ్చిమకాల్వకు 150, నిజాంపట్నంకాల్వకు 71, కొమ్మమూరుకాల్వకు 472 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

ఆలపాటికి అభినందనలు



ఆలపాటిని కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాత్రపాడు సర్పంచ్ తదితరులు

వట్టిచెరుకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాదును మంగళవారం మండలంలోని కాత్రపాడు గ్రామ సర్పంచ్ ఎం శివ శంకర్, చమళ్ళమూడి గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు ఎడ్లపల్లి వాణి, కోటేశ్వరరావు తదితరులు కలసి అభినందనలు తెలిపారు.

17న చేనేతల అర్ధనగ్న ప్రదర్శన

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో చేనేత కార్మికులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 17వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు చేనేత కార్మికులకు అనేక వాగ్దానాలు చేసి అమలు చేయడంలేదని విమర్శించారు. 17న జరిగే అర్ధనగ్న ప్రదర్శనలను జయప్రదం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో చేనేతలకు న్యాయం చేయాలి

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. బడ్జెట్‌ను సవరించి చేనేతకు నిధులు పెంచాలని కోరారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండులో నిర్వహించిన అఖిల భారత పద్మశాలి మహాసభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేనేతలకు రూ.33 కోట్ల రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్‌కు పెడుతున్నట్టు ప్రకటించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో చేనేతల సంక్షేమానికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు.

ధోబీకానా కమ్యూనిటి హాల్ పరిశీలన

తాడేపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 17వ వార్డులో రజకుల ధోబీకానా కమ్యూనిటి హాల్‌ను మంగళవారం టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌ల కోసం రైతులకు అన్యాయం చేస్తారా...

● టీడీపీ జిల్లానేత శ్రీనివాస్

మేడికొండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలవ పరిధిలో సత్తెనపల్లి ఎగువన నిర్మించిన పవర్ ప్లాంట్‌ల కోసం నీటిని మళ్లిస్తూ రైతులకు అన్యాయం చేస్తారా అంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు పాములపాటి శ్రీనివాస్ నీటి పారుదల శాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పేరేచర్లలో విలేకరులతో మాట్లాడుతూ రెండు వారాలుగా బండారుపల్లి, వంకాయలపాడు, నరకుళ్లపాడు మేజరు కాలవలకు నీరు రావడం లేదని, ఏరోజుకారోజు నీరు వస్తుందని ఆశతో ఎదురు చూస్తున్న రైతులకు కాలువలకు నీరు వచ్చే సూచనలు కనిపించకపోవడంతో వారు ఆందోళన పడుతున్నారని తెలిపారు. రైతుల ఆందోళనను అధికారులు పట్టించుకోకుండా ఎగువన ఉన్న పవర్ ప్లాంట్‌లకు నీటిని మళ్లిస్తూ వారి సేవలో తరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

● ఏవో కిరణ్మయి

కాకుమాను, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు అయిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అర్హులందరికీ అందాలని ఏవో కిరణ్మయి అన్నారు. మండలపరిధిలోని వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాల్లో మంగళవారం రైతులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్ద మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు కనుగొన్నారు. 3వ కానా వద్ద నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానిక మత్స్యకారుల సహాయంతో బయటకు తీయించారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, నీలంరంగు జీన్స్ ఉన్నాయని ఇతర ఆధారాలు ఏమీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు తాడేపల్లి పోలీసులు తెలిపారు.

ఎకోపార్కు ప్రవేశ రుసుం నేనే చెల్లించా

● మంగళగిరి వాకర్స్‌కు మంత్రి లోకేశ్ తీపి కబురు

మంగళగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మంగళగిరి వాకర్స్‌కు స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నారా లోకేశ్ మంగళవారం తీపి కబురు చెప్పారు. గత ఏడాదిన్నర నుంచి స్థానిక ఎకోపార్కులో ప్రవేశానికి అటవీశాఖ ప్రవేశరుసుంలను వసూలు చేస్తుంది. రోజువారీ ప్రవేశానికి రూ 20లు వంతున, నెల సీజను టిక్కెట్టుకు రూ 300/-ల వంతున, ఏడాదికి ఒకేసారి చెల్లించినట్టయితే రూ మూడువేల వంతున అటవీశాఖ నిర్వహణ ఫీజుల కింద వసూలు చేస్తుంది. అయితే ఎకోపార్కులో ప్రవేశ రుసుంను ఎత్తివేయించాలని మంగళగిరి వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ అటవీశాఖ అధికారులతో ఈ విషయమై చర్చించగా...వారు అటవీశాఖకు చెందిన పార్కుల లో రుసుం వసూలు కేవలం వాటి నిర్వహణ కోసమేనని...ఇది రాష్ట్రవ్యాపిత పాలసీలో భాగమైవున్నందున రుసుం వసూలును ఎత్తివేయడం సాధ్యంకాదని చెప్పారు. దీంతో లోకేశ్ వాకర్స్‌కు తాను ఇచ్చిన మాట మేరకు వాకర్స్ నుంచి రుసుంల రూపేణా అటవీశాఖకు ఏటా వస్తున్న రూ అయిదు లక్షల మొత్తాన్ని మంగళవారం వ్యక్తిగతంగా చెల్లించారు. వాకర్స్ తరపున ప్రవేశరుసుంను తాను ఏకమొత్తంగా చెల్లించినందున మంగళగిరి ప్రాంతవాసులందరూ ఇకపై ఎటువంటి రుసుం లేకుండా ఉదయం ఆరునుంచి తొమ్మిది గంటల వరకు ఎకోపార్కులో నడక సాగించవచ్చునని లోకేశ్ ప్రకటించారు.



మంగళగిరిలోని ఎకో పార్కు ప్రవేశ ద్వారం

ప్రకృతి వ్యవసాయం ఆధునికమైనది

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్

గుంటూరు సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అందరూ అనుకుంటున్నట్లు ప్రకృతి వ్యవసాయం పురాతనమైనది కాదని ఆధునికమైనదని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టీ విజయకుమార్ అన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఖరీఫ్‌లో ప్రధాన పంటకన్నా ముందుగా పీఎండీఎస్ విత్తనాలు వేయాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతముగా పూర్తి చేయటానికి పీఎండీఎస్ కిట్స్ తయారీలో కావాల్సిన నిధుల సమీకరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కే రాజకుమారి మాట్లాడుతూ పీఎం డీఎస్ వల్ల పంటలు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయని అన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ నేత గోపి చందు, రైతు సాధికార సంస్థ ఎస్ఆర్‌వో శ్రీనివాసరావు, బాజీ బాబు, తెనాలి, పొన్నూరు డివి జన్లకు చెందిన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చరిత్రాత్మక గెలుపులో బీసీల కీలకపాత్ర

● ఎమ్మెల్సీ ఆలపాటి

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించడంలో బీసీలు కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, నేతలు ఆలపాటిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బీసీల అభ్యున్నతితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆలపాటి తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ భవన్‌కు రూ.15 లక్షల విరాళం ప్రకటించారు. కన్నా మాస్టారు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు ఎస్ పుల్లారావు, బాదుగున్నల శ్రీనివాస్, శివరాం, కేసన స్వాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తరలి రావాలి

● పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి విజ్ఞప్తి

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో ఈ నెల 14వ తేదీన జరగనున్న 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన సభ విజయవంతం చేయాలని కోరుతూ 40 డివిజన్ పెద్ద పలకలూరులో చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ చేసి నాయకులు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు, ఈ సభ దేశ చరిత్ర లోనే ఓ గొప్ప సభగా నిలుస్తుందన్నారు. జన సేన పార్టీ రాబోయే రోజుల్లో క్రియాశీలకంగా ఎలా వ్యవహరించాలని ఈ సభ ద్వారా అధినాయకుడు పవన్‌కల్యాణ్ పార్టీ శ్రేణులకు నిర్దేశిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, జిల్లా కార్యదర్శి డేగల లక్ష్మణ్, 16వ డివిజన్ కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, 47వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



చలో పిఠాపురం పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు

మాజీ సైనిక సంక్షేమ సంఘం ఎన్నికలకు నామినేషన్లు

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీన జరుగనున్న ఏపీ మాజీ సైనిక సంక్షేమ సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మంగళగిరి పార్కురోడ్డులోని సంఘం కార్యాలయంలో అడహక్ కమిటీ కోఆర్డినేటర్ కే.గోవిందరావు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి జీ శివనాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయగా ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర గుప్తా, ఎం వెంకటేశ్వరరావు బలపరిచారు. అధ్యక్ష పదవికి అన్నె రామారావు నామినేషన్ దాఖలు చేయగా, ఎం శరత్‌బాబు, కే విఠల్‌రావు, ప్రేమ్‌కుమార్ బలపరిచారు. కోశాధికారి పదవికి ఉమామహేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయగా, శివనాగేశ్వరరావు, వెంకటేశ్వర గుప్తా, ఈ వెంకటేశ్వరరావులు బలపరిచారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న శివనాగేశ్వరరావు

నృసింహుని బ్రహ్మోత్సవాల్లో కోదండరామయ్య గానం

మంగళగిరి సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆకురాతి కోదండరామయ్య గత పాతికేళ్ల నుంచి మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి సేవలో తరిస్తున్నారు. వార్షికంగా జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 25 సంవత్సరాల నుంచి అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. కోదండరామయ్య గతంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా కూడా పనిచేశారు.

పది విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత

పెదనందిపాడు (పాలపర్రు), మార్చి, 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపర్రు ఎస్ఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పది విద్యార్థులకు దాతలు మంగళవారం పరీక్ష కిట్లు అందజేశారు. పాఠశాల పూర్వపు విద్యార్థి ముద్దన సుబ్బారావు కుమారుడు నారాయణ, కోడలు హరిత జ్ఞాపకార్థం వారి కుమార్తె పూజిత విద్యార్థులకు పరీక్ష సామగ్రి పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు, రైటింగ్ ప్యాడ్‌లను అందజేశారు. ఇటీవల అమెరికాలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి పూజిత విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అనంతరం దాత పూజితను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వపు విద్యార్థుల సంఘం ట్రెజరరీ దొప్పలపూడి రమేష్ బాబు, హెచ్ఎం శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సమన్వయకమిటీ మహిళా విభాగం సమావేశం

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని రాజగృహలో బీసీ సమన్వయ కమిటి రాష్ట్ర మహిళా విభాగం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమన్వయ కమిటీ గౌరవాధ్యక్షుడు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా సమన్వయకమిటి ఏర్పాటు చేశారన్నారు. బీసీలందరూ కులగణన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

బాలుడి వైద్యానికి మంత్రి లోకేశ్ చొరవ

● సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.52 లక్షల సాయం

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఓ బాలుడు ఊహించని ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండడంతో మంత్రి లోకేశ్ సత్వరమే స్పందించి చేయూతనందించారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడుకు చెందిన కైకవరపు వెంకట్రావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకట్రావుకు ఏడాదిన్నర వయస్సు కుమారుడు ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక సాయం కావాలని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా మంత్రికి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన లోకేశ్ బాలుడికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్షా 52 వేల చెక్కును బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరు చేయించారు. మంత్రి లోకేశ్ చొరవకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.



సీఎంఆర్ఎఫ్ పత్రాలను చూపుతున్న వెంకట్రావు

కాజలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక టీడీపీ నేతలు మంగళవారం సాయంత్రం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పుల్లయ్యనగర్‌కు చెందిన దోసపాటి వెంకటేశ్వరమ్మకు రూ.83,454, పెదనరసింహారావుకు రూ.64,958లు, తోట లక్ష్మీ తిరుపతమ్మకు రూ.53,541ల చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, నేతలు చింకా కోటేశ్వరరావు, కుక్కమళ్ల సాంబశివరావు, దానబోయిన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల ఏర్పాటు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో హైస్కూల్ ఉపాధ్యాయులు

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలను మంగళవారం ఏర్పాటు చేశారు. బాలుర స్కౌట్ మాస్టర్‌గా సాయిబోస్, బాలికల గైడ్ టీచర్‌గా దేవీప్రసన్న ఎంపికయ్యారు. ఎంఈవో ఎన్ బాబు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ గ్రూపులో చేరిన 32 మంది విద్యార్థులకు తాడికొండలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్ర కార్యాలయంలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ శ్రీనివాసరావు, పీ మాధవి, పీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యకాస వర్క్‌షాపును జయప్రదం చేయాలి

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మల్లయ్య లింగయ్య భవన్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో జరుగనున్న వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాపును జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో మంగళవారం వర్క్‌షాపు తాలూకా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు సంవత్సరం పొడవునా చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కార్యదర్శి నూతక్కి శ్రీనివాసరావు, కంభంపాటి దేవుని దయ, పంతగాని మరియదాసు, ఉయ్యాల సత్యనారాయణ, జానీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లిని కలిసిన ఆళ్ల వెంకట్

పెదనందిపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎంఎస్ఈ సెర్ప్, ఎన్ ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను అమరావతి సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మంగళవారం ఎన్నారై టీడీపీ లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల అభివృద్ధికి ఎన్నారైలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని మంత్రి సూచించారని, అందుకు ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని రానున్న రోజుల్లో మరింత తోడ్పాటునందిస్తామని, ప్రవాసాంధ్రుల సహకారంతో గ్రామాలను దత్తత కూడా తీసుకుని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఎన్నారైలే గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని తెలిపారు.



సెక్రటరియేట్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసిన ఆళ్ల వెంకట్

వాటర్ ట్యాంకుకు మరమ్మతులు

తాడికొండ(రావెల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రావెలలో వాటర్ ట్యాంకు నుంచి తాగునీరు వృథా అవుతుందనే కథనం ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితం అవ్వటంతో స్పందించిన పంచాయతీ సెక్రటరి వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేయించారు. వాటర్ ట్యాంకులకు కుళాయిలు బిగించి నీరు వృథా కాకుండా అరికట్టారు. మిగిలిన గ్రామాల్లోని వాటర్ ట్యాం కుల మరమ్మతులు చేయించి నీటిని వృథా కాకుండా చూస్తామని ఈవోపీఆర్‌డీ సాయిలీల చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



రావెల ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేయించిన సెక్రటరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ విధులు

తాడికొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు అనే కథనం ఆంధ్రజ్యోతిలో సోమవారం రావటంతో స్పందించిన ఎంపీడీవో సమతావాణి నూతనంగా నిర్మించిన ఎండీపీవో కార్యాలయం తలుపులు తెరిపించారు. కార్యాలయంలో ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఒక హాల్లో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి కేటాయించామన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పనులు చేస్తున్నారని తెలిపారు. అయితే సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ఆంధ్రజ్యోతి ప్రతినిధి వెళ్లి చూసినప్పుడు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏపీవో అప్పుడే వెళ్లిపోయినట్లు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తెలిపారు.



ఎంపీడీవో నూతన కార్యాలయానికి తెరుచుకున్న తలుపులు

నాలుగో కేటగిరి అసైన్డ్ రైతులకు ప్లాట్లు కేటాయించాలి

తుళ్లూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాలుగో కేటగిరి అసైన్డ్ రైతులకు ప్లాట్లు కేటాయించాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను దళిత జేఏసీ నేత పులి చిన్నా మంగళవారం వెలగపూడి సచివాలయంలో కలసి విన్నవించారు. అసైన్డ్ రైతులను గత వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని సిట్ ఏసీబీ కేసులంటూ కౌలు కూడా ఇవ్వకుండా మభ్యపెట్టిందని మంత్రికి వివరించినట్టు చిన్నా చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కౌలు కూడా ఇచ్చేసింద ని, నాలుగో కేటగిరి ప్లాట్లను కూడా కేటాయించి న్యాయం చేయాలని కోరినట్టు తెలిపారు.



సచివాలయంలో మంత్రి నారాయణతో మాట్లాడుతున్న పులి చిన్నా

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయ హోమంలో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ద్వితీయవార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆఖరిరోజు కార్యక్రమాలు మంగళవా రం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆద్యంతం ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో నిండిపోయింది. నాలుగు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా, అర్చకులు సాకేత్‌శర్మ, రామచంద్రల పర్యవేక్షణలో ఉదయం 6 గంటలకు స్వామివారి సుప్రభాతసేవతో ప్రారంభించి, నవనీత హారతి, నిత్య కైంకర్యారాధన జరిపారు. అనంతరం ఉదయం 7గంటలకు ఉక్త హోమం, నిత్య హోమం, పారాత్మికహోమం నిర్వహించారు. 4వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6గంటలకు ధ్వజారోహణం, భేరీ పూజ, తాడనం, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపుసేవల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

11శాతం వడ్డీరేటు ఇస్తున్న కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ

● చైర్మన్ దావులూరి కాంతారావు

దుగ్గిరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాదారులకు అత్యధికంగా 11శాతం వడ్డీరేటును అందిస్తోంది ది కాకతీయ మ్యూచ్‌వల్లి ఎయి డెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ మాత్రమేనని చైర్మన్ దావులూరి కాంతారావు అన్నారు. దుగ్గిరాలలో నూతనంగా బ్రాంచిని 12వతేదీ బుధవారం ఉదయం ప్రారంభించనున్న నేపథ్యంలో చైర్మన్ కాంతారావు మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పదివేలకు పైగా సభ్యులు, రూ.150కోట్లకు పైగా డిపాజిట్లతో రూ.580కోట్ల టర్నోవర్‌తో 25ఏళ్లుగా ప్రజాదరణను పొందుతునామన్నారు. ఉదయం 10.42ని.లకు దుగ్గిరాలలో ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో పాటు పద్మశాలీయవెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నందం అబద్దయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రారంభించనున్నారని తెలిపారు.



చైర్మన్ కాంతారావు

13న తుమ్మలపాలెంలో కవయిత్రి మొల్ల 585వ జయంతి

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల 585వ జయంతిని ఈ నెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రత్తిపాడు మండలంలోని తుమ్మలపాలెంలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో శాలివాహనులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ట్రైనీ కమిషనర్‌గా స్వప్నిల్ పవార్



ట్రైనీ కమిషనర్ స్వప్నిల్ పవార్‌కు మొక్కను బహూకరిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి మునిసిపల్ ట్రైనీ కమిషనర్‌గా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ (అండర్ ట్రైనింగ్) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 22వ తేదీ వరకు ఇండిపెండెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించనున్నారు. పవార్‌ను మునిసిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏమార్చి ఏటీఎం కార్డుతో రూ.1.10 లక్షల చోరీ

తెనాలి క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసుకోవడానికి వచ్చిన వృద్ధుడిని ఏమార్చి రూ.1.10 లక్షలు ఆగంతకులు డ్రా చేసుకున్న సంఘటనలపై మంగళవారం కేసు నమోదైంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నాజరుపేటలో నివాసం ఉంటున్న దాలిపర్తి రవీంద్రనాథ్ (74) తెనాలి కోర్టులో అమీనాగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ నెల 8న కొత్తపేట ఎస్‌బీఐ ఏటీఎం నుంచి నగదు డ్రా చేసుకోవడానికి వెళ్లగా అందులో ఉన్న ఒక ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టి చూడగా మిషన్ పని చేయడం లేదు. అదే సమయంలో పక్కన ఉన్న ఇద్దరు యువకులు ఈ మిషన్ పని చేస్తుంది రండి అంటూ ఆ ఏటీఎం నుంచి రూ.9,500 డ్రా చేసుకోవడానికి తోడ్పడ్డారు. కార్డు నగదు తీసుకువెళ్లిన రవీంద్రనాథ్ మంగళవారం తనకు వచ్చిన ఫోన్ మెసేజ్ చూసుకుంటే తన అకౌంట్ నుంచి రూ.1 లక్ష 10వేల 500డ్రా చేసినట్లు ఉంది. ఈ నగదు డ్రాలు విజయవాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని వివిధ ఏటీఎంల ద్వారా కొద్దికొద్ది మొత్తాలలో డ్రా చేసినట్లు బ్యాంకు అధికారులు ద్వారా తెలుసుకున్న బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

తెనాలి, మారీసుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముందువెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఆగటంతో వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడు లారీని ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగపేటకు చెందిన కందుల రాజేష్ పాలిష్ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం నందులపేటలో పనికని ద్విచక్రవాహనంపై గంగానమ్మపేట వైపునకు వెళుతండగా ఆలపాటి వారధి సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఆగటంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని ఢీ కొంది. లారీ వెనుక భాగాన ఉన్న ఇనుప వగ్గి రాజేష్ తలలోకి బలంగా దిగింది. ఇది గమనించిన స్థానికులు గాయపడిన రాజేష్‌ను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. పురపాలక సంఘ పరిధిలో 20024 - 2025 సంవత్సరానికి సంబంధించి బీసీ, మైనారిటీ, ఇబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం అర్హత గల అభ్యర్థులు ఇటీవల మీసేవ, గ్రామ వార్డు సచివాలయం ద్వారా పొందిన కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు కాపీ, ఆధార్ కాపీలతో మీసేవలో లేదా ఏదైనా ఇంటర్‌నెట్ సెంటర్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి 22వ తేదీ లోపు వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం పురపాలక సంఘ మెప్మా విభాగంలో సంప్రదించాలని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి: ఏడీఏ

పొన్నూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ సంఖ్య తప్పనిసరిగా పొందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు రామకోటేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాలెం, మామిళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పైరు పరిశీలించి నీటి ఎద్దడిపై పలు సూచనలు చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ పీఎం కిసాన్, ఆర్థిక సాయం పొందడానికి ఇతర ప్రభుత్వ సేవలు అందుకోవడానికి రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్ పొందాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో దేగల వెంకట్రామయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి విలీన ప్రతిపాదిత గ్రామాల్లో సభలు: ఎంపీడీవో

పొన్నూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) పొన్నూరు పురపాలక సంఘంలో విలీన ప్రతిపాదిత గ్రామాలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ నెల 12న ఆలూరు, 13న చింతలపూడి, వడ్డిముక్కల, పెదఇటికంపాడు, 15న కట్టెంపూడి, 18న కసక్రరులో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పురపాలక సంఘంలో విలీనంపై ఆయా గ్రామాలవాసులు తమ అభిప్రాయాలను గ్రామ సభలలో విన్నవించాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

నిరుపయోగంగా రూ.కోట్ల విలువైన స్థలం



పెరిగిన చెట్లతో అడవిని తలపిస్తున్న కొత్తపేటలోని పోలీసు క్వార్టర్లు

- 1983లో పోలీస్ క్వార్టర్ల నిర్మాణం
- దశాబ్దకాలంగా నిలిచిన వినియోగం
- అడవిని తలపిస్తున్న క్వార్టర్లు
- భవనాలు నివాసయోగ్యం కాదని మునిసిపల్ అధికారుల నిర్ధారణ
- భవవాల తొలగింపులో ఉన్నతాధికారుల సాచివేత ధోరణి

తెనాలి క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున కొత్తపేటలో పోలీసు శాఖకు రూ.20కోట్లు విలువైన స్థలం ఉంది. ఈ శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం జాప్యంతో ఏళ్ల తరబడి అది నిరుపయోగంగా పడి ఉంది. ఈ విలువైన పోలీసు స్థలంలో 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు 60 పోలీసు కుటుంబాలకు నివాసయోగ్యంగా పోలీసు క్వార్టర్స్ నిర్మించారు. 25-30 సంవత్సరాల వరకు పోలీసు కుటుంబాలు అందులో ఉన్నాయి. అనంతరం అది శిథిలావస్థకు చేరాయి. పెచ్చులు ఊడిపోవడం, శ్లాబు పగుళ్లు ఏర్పడటం, కిటికీలు, దర్వాజాలు ఊడిపోయి అలంకారప్రాయంగా ఉండటంతో పోలీసు కుటుంబాలు క్రమేణా అక్కడ ఖాళీ చేశాయి. దశాబ్ద కాలం పైగా ఆ స్థలం, క్వార్టర్స్ ఖాళీగా ఉన్నాయి. దీనితో అందులో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. పది సంవత్సరాల క్రితమే మునిసిపల్ అధికారులు ఈ భవనాలు నివాసయోగ్యం కాదని సర్టిపై చేశారు. అయితే ఈ భవనాలను తొలగించడానికి పోలీసు ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారులు శ్రద్ధ చూపి అనుమతులు ఇస్తే ఈ స్థలంలోని చెట్లు కలప, శిథిల భవనాల మెటీరియల్స్ కొద్ది ఖర్చుతోనే ప్రైవేట్ వ్యక్తులు తరలించుకుంటారు. ఈయితే ఈ కోట్ల విలువైన స్థలం అందుబాటులోకి తెస్తే శాఖాపరంగా ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే పట్టణంలోని నాలుగు పోలీసుస్టేషన్‌లో తగినంత స్థలం లేక కోర్టు కేసులకు సంబంధించి పట్టుబడిన వివిధ రకాల వాహనాలను స్టేషన్ల ముందు రోడ్డులపై నిలిపి వేస్తున్నారు. ఆ ప్రాంతాలలో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. పోలీసు సిబ్బంది సామూహికంగా నిర్వహించుకునే క్రీడలు, డ్రిల్, ఫంక్షన్స్ వంటి ఏర్పాటుకు తగిన సొంత స్థలం లేదు. ఈ శిథిల క్వార్టర్స్‌ని తొలగిస్తే పోలీసు సిబ్బందికి ఎంతగానే ఉపయోగపడుతుంది. ఇటీవల ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ స్థానిక పోలీసు అధికారుల కోరిక మేరకు డీఎస్పీ జనార్ధనరావుతో కలిసి శిథిల భవనాలను పరిశీలించారు. గతంలో కూడా జిల్లా అధికారులు ఈ శిథిల భవనాలను పరిశీలించారు కానీ సరైన నిర్ణయం తీసుకోకపోవడంలో సాచివేత ధోరణి వలన రూ.20కోట్ల విలువైన స్థలం పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. ఈ మొక్కల్లో పుట్టలు ఏర్పడి పాములకు అవాసంగా మారింది. ఈ విషయంలో మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛతా దివస్ సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, పక్కన అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధిద్దామ మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయం మెప్మా షెడ్‌లో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న స్వచ్ఛతా దివస్ సన్నాహక సమావేశాన్ని అధికారులతో కలసి శానిటేషన్ అధికారులు నగరదీపికలు, ఆర్‌పీలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కాకుండా క్లాత్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. తెనాలిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు 120 మైక్రాన్స్ కన్న తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నిషేధించావన్నారు. వాటిని మునిసిపల్ కార్యాలయంలో గాని శివాజీచౌక్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల నందు కేజీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను జమచేసి ఒక కేజీ పంచదారగాని, కేజీ టమాట, కేజీ సేమ్యా, ఆరు కోడిగుడ్లు లేక అర లీటర్ పాలుగాని పోత్సాహక బహుమతులుగా అందిస్తామన్నారు. పట్టణంలో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు క్యారీ బ్యాగులను నిల్వచేయడం అమ్మడం, వాడకం, ప్లాస్టిక్ పుల్లలతో కూడిని ఇయర్ బడ్స్, బెలూన్‌లో వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ జెండాలు, పేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, స్పూన్లు, కత్తులు స్ట్రాలు, స్వీట్ బాక్సులు, 120 మైక్రాన్లు కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులన్నీ నిషేధించామని తెలిపారు. నిబంధలను అతిక్రమించిన వారిపై జరిమాను విధించడం, షాపు లైసెన్స్‌లను రద్దు చేయటంతోపాటు పురపాలక సంఘ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, నగరదీపికలు, ఆర్‌పీలు తదిరులు పాల్గొన్నారు.

15న నుంచి ప్లాస్టిక్ రహిత పొన్నూరు

పొన్నూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈ నెల 15 నుంచి ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకారం అందించాలని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు మంగళవారం కోరారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ పొన్నూరు కార్యక్రమంలో భాగంగా 15నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పట్టణంలో పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్‌లు, క్యారీబాగ్‌లు, వాటర్ ప్యాకెట్‌లను నిషేధిస్తున్నట్లు చెప్పారు. కవర్‌ల తయారీ, అమ్మకం, వినియోగం నిషేధించినట్లు వివరించారు. వినియోగదారులు ప్లాస్టిక్ కవర్‌ల బదులు నూలు, జూటు, జనపనారతో చేసిన బ్యాగ్‌లు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించిన విక్రయించిన రూ.2500 నుంచి రూ 5 వేల వరకు అపరాధ రుసుము విధించనున్నట్లు హెచ్చరించారు. వినియోగదారులు వస్తుసామాగ్రి కోసం తమ వెంట సంచులు తెచ్చుకోవాల్సిందిగా సూచించారు.



కొల్లిపరలో నృత్యప్రదర్శన చేస్తున్న అమని శిష్య బృందం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కొల్లిపర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో అమని నృత్య కళా నిలయం, హైదరాబాద్ తాడిచర్ల, తాడినాడ వారి కాంబినేషన్‌లో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమనిని ప్రేక్షకులతో పాటు, కళాకారులు, శ్రీకళానిలయం కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు అవుతు కృష్ణారెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, పండితులు జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృధ్విభార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సదరం క్యాంప్ ద్వారా అనర్హులు సైతం సర్టిఫికేట్లు పొంది పింఛన్ పొందుతున్నారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వారంలో మూడు రోజులు (బుధ, గురు, శుక్ర) వివిధ విభాగాల ప్రత్యేక వైద్యుల ద్వారా లబ్ధిదారులను పరీక్షించి సర్టిఫికేట్ల రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా ప్రక్రియను నిలుపుదల చేశారు. కోడ్ ముగియడంతో రీ వెరిఫికేషన్ ప్రక్రియను బుధవారం నుంచి పునఃప్రారంభించనున్నారు. అందుకు అనువుగా వైద్యశాలలో సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

జిల్లా స్థాయి వార్డు చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విభావార్డు పవర్ చాంపియన్ షిప్ పోటీలలో పొన్నూరు పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు తెలిపారు. వార్డు పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ అలపర్తి చంద్రమోహన్ చేతుల మీదగా మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి జగదీశ్ జిల్లా స్థాయి ద్వితీయ స్థానం, ఆస్మా మూడో స్థానం, సాధించారు. నాల్గో తరగతిలో యశస్విని ద్వితీయస్థానం సాధించారు. ఈ విద్యార్థులను చంద్రమోహన్ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలా కుమారి, ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు మండలంలోని వేజెండ్ల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వార్డు చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపినట్లు ఎంఈవో రాయల సుబ్బారావు తెలిపారు. 2వ తరగతి నుంచి నూతక్కి విరోధిక, యశ్వంత్ ప్రియ, మూడో తరగతి నుంచి వేజెండ్ల రాజశేఖర్, నాల్గవ తరగతి నుంచి కోడూరి సిద్దార్థ, బక్కా సహకార్య, ఐదవ తరగతి నుంచి వేజెండ్ల మధుబావు, శేషన్ జశ్వంత్, ఎంపికయినట్లు చెప్పారు. కోడూరి యశ్వంత్ ప్రియ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు వివరించారు. ఈ నెల 13న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు యశ్వంత్ ప్రియ ఎంపిక కావడంపై ఎంఈవో రాయల సుబ్బారావు, హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

అంగలకుదురు హైస్కూల్‌లో స్కాట్ విభాగం ప్రారంభం

తెనాలి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని అంగలకుదురు హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్కాట్ విభాగాన్ని ఎంఈవో జయంతిబాబు ప్రారంభించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకంలో స్కాట్ అండ్ గైడ్స్ విభాగాన్ని 32మంది విద్యార్థులతో అమలు చేసేందుకు రూ.50వేలు మంజూరు చేసినట్లు చెప్పారు. స్కాట్ వ్యవస్థాపకులు బెడెన్‌పొల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడుకొండలు, హెచ్‌ఎం అనూరాధ, స్కాట్ మాస్టర్ కామాక్షి, నారాయణస్వామి, ఉపాధ్యాయులు జనార్ధనరావు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో ఆకస్మిక తనిఖీ

కొల్లిపర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హనుమాన్‌పాలెం, తూములూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోరే..?

● స్తంభం తీగలకు వేలాడుతున్నా ఉదాశీనంగా విద్యుత్ శాఖ అధికారులు



వైర్లకు వేలాడుతున్న స్తంభం, విరిగిన స్తంభం పక్కగా వెళుతున్న పశువులు

తెనాలి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం విరిగి దానికి అమర్చిన తీగలకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నా ఆ శాఖ అధికారులకు పట్టదా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని సంగంజాగర్లమూడి నుంచి శేకూరు రోడ్డు వెళ్లే రైల్వే గేట్ల సమీపంలోని పంప్ హౌస్‌కు వెళ్లే మార్గంలో ఈ స్తంభం విరిగి ఉంది. దానికి అమర్చిన విద్యుత్ తీగల ఆధారంగా స్తంభం వేలాడుతోంది. ఈ మార్గంలో నిత్యం గేదెలను మేపుకునేందుకు పాడిరైతులు, పంప్‌హౌస్‌కు వెళ్లే ఉద్యోగులు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారు, వ్యసాయ పనులకు వెళ్లే కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. స్తంభం విరిగి విద్యుత్ లైన్లవైర్ల సాయంతో వేలబడుతూ గత పదిరోజులుగా ఉండటంతో వైర్లు సాగి స్తంభం నేలకు తగిలి నిలిచి ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభం అమర్చకపోతే తీగలు తెగి నేలవాలే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



కల్యాణం జరుపుతున్న అర్చకులు

ఘనంగా రుక్మిణీ కల్యాణం, సింధూరార్చన

తెనాలి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి ఉత్సవాలలో శ్రీరుక్మిణి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట తాలూకా జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ కల్యాణ క్రతువును భక్తులకు వివరించారు. మాచిరాజు వేణుగోపాల్, పద్దిపర్తి పద్మాకర్‌లు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. పలువురు పండితులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సామూహికంగా నిర్వహించిన సింధూరార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొల్లిపర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృధ్విభార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మలు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన, రక్షాధారణ, ధ్వజారోహణ పూజలు చేసిన అనంతరం భక్తులకు మంత్ర పుష్పంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.



చెక్కు అందజేస్తున్న డీజీఎం కృష్ణకుమార్

పరపతి సౌకర్యాలు వినియోగించుకోవాలి

● ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్

తెనాలి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వావలంబనకు బ్యాంకు పరపతి సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం బి.కృష్ణకుమార్ చెప్పారు. మారీసుపేటలోని ఎస్‌బీఐలో మంగళవారం నిర్వహించిన టౌన్‌హాలు మీటింగ్‌లో డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.10కోట్లు రుణాలు పంపిణీ చేశారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించి తిరిగి చెల్లించిన వారికి మంచి రుణ పరపతి లభిస్తుందన్నారు. మహిళల ప్రతి అడుగులో ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించేందుకు స్టేట్ బ్యాంకు ఎల్లవేళలా ముందుంటుందని చెప్పారు. రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, స్నేహలత పర్యవేక్షించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సీఈవో ఉమామహేశ్వరరావు

ఎన్ఆర్ఐ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు లభించాయి. ఇన్ఫోసిస్, విప్రో, ఎల్ అండ్ టీ, ఎంఆర్ఎఫ్, జీఎంఆర్, అపోలో కంపెనీలు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించాయి. 84మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరికి రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు వేతనం లభిస్తుందని సీఈవో ఉమామహేశ్వరరావు తెలిపారు. రెండో ఫేజ్‌లో టీసీఎస్, టెక్ మహీంద్ర, హెటిరో తదితర కంపెనీలకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 140మంది ఎంపికయ్యారని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్ లాజర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

జేఎంజే కళాశాలలో ముగిసిన యువజనోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రోడ్డులోని జేఎంజే మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఫేస్ పెయింటింగ్, ఫ్లే మోడలింగ్, పోస్టర్ పెయింటింగ్ ఫ్యాషన్ పరేడ్, టీషర్ట్ డిజైనింగ్ వంటి పోటీలలో పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. గృహ విజ్ఞానశాస్త్రం హెచ్‌వోడీ పాటిబండ్ల హేమలత న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ షైనీ, మేరీశారద, విజయలక్ష్మి, కేబీ బాబు, జయశేఖర్ పర్యవేక్షించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.